సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
శుక్రవారం, 13.03.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 141
పేజీలు: 12 వెల: రూ. 5



# అక్కడా.. ఇక్కడా..

# సేమ్ టూ సేమ్!

## స్పీకర్ నిర్ణయానికే సుప్రీంకోర్టు ప్రాధాన్యం

## ఫిరాయింపుల కేసుల్లో బీఆర్ఎస్‌కు పెద్ద షాక్

- విచారణ ముగిసిందని ప్రకటించిన అత్యున్నత న్యాయస్థానం
- స్పీకర్ ఇప్పటికే తీర్పు ఇచ్చారని కోర్టుకు వివరణ
- సింఘ్వీ వాదనలతో ధర్మాసనం సంతృప్తి
- రెండు రోజుల్లో ఆర్డర్ కాపీలు ఇవ్వాలని ఆదేశం
- పార్టీ మారిన ఎమ్మెల్యేల వ్యవహారంపై తెరపడిన న్యాయపోరాటం
- తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు
- పదో షెడ్యూల్ కింద అనర్హత డిమాండ్‌కు బ్రేక్
- ఇక స్పీకర్ నిర్ణయమే ఫైనల్ అన్న సుప్రీంకోర్టు
- బీఆర్ఎస్‌కు షాక్!




**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేల వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై ఇవాళ సుప్రీంకోర్టు తుది విచారణ చేపట్టింది. స్పీకర్ నిర్ణయం తీసుకున్నందున విచారణ ముగిసినట్టు ప్రకటించింది. తెలంగాణ రాజకీయాల్లో గత కొన్ని నెలలుగా అత్యంత ఉత్కంఠ రేపుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారంలో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక నిర్ణయం వెల్లడించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలన్న బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై సుదీర్ఘంగా చేస్తున్న విచారణ ముగించింది. ఈ వ్యవహారంలో అసెంబ్లీ స్పీకర్ ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారన్న వాదనతో ఏకీభవించింది. ఈ కేసు విచారణ ముగిస్తున్నట్టు ప్రకటించింది. ఇది బీఆర్ఎస్‌కు షాకింగ్ నిర్ణయంగానే చెప్పవచ్చు.

**అత్యున్నత న్యాయస్థానంలో ఏం జరిగింది?**

జస్టిస్ సంజయ్ కరోల్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించింది. బీఆర్ఎస్ నుంచి ఇతర పార్టీల్లోకి వెళ్లిన ఎమ్మెల్యేల వ్యవహారంపై దాఖలైన పిటిషన్లను విచారణకు స్వీకరించిన ధర్మాసనం, ఇవాళ తుది విచారణ చేపట్టింది. ఈ క్రమంలో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ తన వాదనలను బలంగా వినిపించారు. సింఘ్వీ తన వాదనల్లో ప్రధానంగా ఒక అంశాన్ని మిగతా 02లో

# వదలం


## ఢిల్లీ లిక్కర్ కేసులో మరో మలుపు!

- బంజారాహిల్స్‌లో కవిత నివాసానికి సీబీఐ బృందం చేరిక
- ఈ నెల 16న విచారణకు హాజరుకావాలని నోటీసులు
- ఇంట్లో లేని కవిత.. భర్త అనిల్‌కుమార్‌కు నోటీసుల అందజేత
- ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో కొత్త మలుపు
- హైకోర్టులో దాఖలైన కౌంటర్ అఫిడవిట్‌పై వివరణ కోరిన సీబీఐ
- రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన క్లీన్ చిట్‌పై సీబీఐ అప్పీల్
- దర్యాప్తు వేగవంతం చేసిన సీబీఐ అధికారులు
- కవిత ప్రస్తుతం ఎక్కడ ఉన్నారో విచారించిన అధికారులు
- తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ వేడెక్కిన ఢిల్లీ లిక్కర్ కేసు
- కేసు పరిణామాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉన్న కల్వకుంట్ల కవిత నివాసానికి మధ్యాహ్నం సీబీఐ అధికారులు చేరుకున్నారు. కోర్టు జారీ చేసిన నోటీసులు అందజేశారు. 16 న విచారణకు హాజరుకావాల్సిందిగా నోటీసు ల్లో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో తాజా పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వేడిని పెంచాయి. మాజీ ఎమ్మెల్సీ, కేసీఆర్ కుమార్తె కవిత నివాసం వద్ద హైడ్రామా చోటు చేసుకుంది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులు ఆమెకు నోటీసులు అందజేశారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉన్న కల్వకుంట్ల కవిత నివాసానికి మధ్యాహ్నం సీబీఐ అధికారులు చేరుకున్నారు. ఢిల్లీ లిక్క ర్ స్కామ్‌కు సంబంధించిన హైకోర్టులో దా ఖలైన తాజా కౌంటర్ అఫిడవిట్‌పై వివరణ కోరుతూ కోర్టు జారీ చేసిన నోటీసులు అం దజేయడమే అధికారుల ప్రధాన ఉద్దేశం. అయితే అధికారులు వెళ్లిన సమయంలో కవిత తన నివాసంలో అందుబాటులో లేరు. దీంతో సీబీఐ అధికారులు ఆ నోటీసులను కవిత భర్త అనిల్ కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు అనిల్ కుమార్‌తో మాట్లాడినట్టు తెలుస్తోంది. కవిత ప్రస్తుతం ఎక్కడ ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. మిగతా 02లో




DASTI
R-2
IN THE HIGH COURT OF DELHI AT NEW DELHI
Actual Dated: 16.03.2026
Crl. Rev. P. No. 134/2026 & Crl. M.A. 6853/2026
Central Bureau of Investigation ...........Petitioner
Versus
Kuldeep Singh & Ors ...........Respondent
NOTICE TO : Respondent No. 17: Kavitha Kalvakuntla @ K. Kavitha S/o D.R. Anil Kumar R/o H.No. 8-2-316/4

Should you wish to argue anything against the application/petition, you are at liberty to do so on the date fixed or any other date to which the case may be postponed. Also take notice that in default of your appearance on the date fixed and in the manner above, the application/petition will be heard and decided exparte in your absence.

Given under my hand and the seal of the High Court of Delhi, at New Delhi this the 10th day of March, 2026.

A.O.J. (Crl.I)
For Registrar General

## మనం సైతం..

# కొండగట్టుకు

భాజా భజంత్రీలతో..
కనీవినీ ఎరగని రీతిలో సక్సెస్ చేద్దాం



- 14న పొద్దున్నే 6 గంటలకే చేరుకుందాం
- టెన్త్ పరీక్షా విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చేద్దాం..
- వేలాది మందితో కలిసి బండి సంజయ్ మహా పాదయాత్ర
- బీజేపీ సీనియర్ నేతల భేటీ

03

## నెట్‌ఫ్లిక్స్ వచ్చిందంటే హాలీవుడ్ వచ్చినట్లే..

### తెలంగాణకు 500 మల్టీనేషనల్ కంపెనీలు తెస్తాం

- ఆ ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి
- దిగ్గజ కంపెనీలకు అన్ని సదుపాయాలు కల్పిస్తాం
- కంపెనీల రక్షణ సర్కార్ బాధ్యత: సీఎం రేవంత్ రెడ్డి




ప్రపంచంలో ఉన్న ఐదొందల పెద్ద మల్టీనేషనల్‌కంపెనీలను తెలంగాణకు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియో కార్యాలయాన్ని హైటెక్ సిటీలో సీఎం రేవంత్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. 10

### యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని

## దర్శించుకున్న గవర్నర్

- కుటుంబ సభ్యులతో కలిసి స్వయంభూ స్వామివారిని దర్శించుకున్న శివ ప్రతాప్ శుక్లా
- ధ్వజస్తంభం వద్ద మొక్కులు చెల్లించి, అంతరాలయంలో ప్రత్యేక అర్చనలు
- గవర్నర్‌కు పూర్ణకుంభ స్వాగతం పలికిన ఆలయ అర్చకులు
- శ్రీ పర్వత వర్ధిణి సమేత రామలింగేశ్వర స్వామివారికి స్పటిక లింగ అభిషేకం
- ఆలయ మర్యాదలతో స్వామివారి మెమెంటో, ప్రసాదాన్ని అందజేసిన ఈవో

10



## ఆర్టీసీ కార్మికుల సమస్యలపై గళమెత్తుతా



### మాజీ మంత్రి హరీశ్ రావు

### అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తా

10

రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటోన్న సమస్యలు, పాలకుల వ్యతిరేక విధానాలపై అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు.

## 15 నుంచి ఒంటిపూట బడులు

### విద్యాశాఖ ఆదేశాలు జారీ



రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో 15 నుంచి ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు నిర్వహించబోతున్నట్లు విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ప్రకటించారు. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరుగుతున్న నేపథ్యం లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఉదయం 8 గంట ల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పాఠశాలలు పని చేస్తాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం 12:30 గంటలకు మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించారు.

## నెత్తురు చిందిన నేలపై క్రీడా స్ఫూర్తి

04

**లోయలో కమల వికాసం**

దేశవాళీ క్రికెట్ సమరంలో కనీవిని ఎరుగని అద్భుతం ఆవిష్కృతమైంది. హేమాహేమీలైన ముంబయి, ఢిల్లీ, తమిళనాడు వంటి జట్లు చతికిలపడ్డ చోట.. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ 'అండర్ డాగ్'గా బరిలోకి దిగిన జమ్మూకశ్మీర్ రంజీ ట్రోఫీని ముద్దాడి చరిత్ర సృష్టించింది.



## దళిత వాదంతోనే కాంగ్రెస్ ఆవిర్భావం

02


**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**



- కాంగ్రెస్ పాలనలో దళితులకు, ఆదివాసీలకు, బీసీలకు సముచిత స్థానం
- కష్టకాలంలో కాంగ్రెస్‌కు అండగా దళితులు

### ఇదీ సంగతి — ముద్ర

సంధ్య థియేటర్ వివాదంలో ఇదే బన్నీపై కేసులు నమోదు చేసి జైలుకు పంపింది తెలంగాణ ప్రభుత్వం. ఈరోజు కోకాపేటలోని 'అల్లు సినిమాస్' ను ప్రారంభించిన అనంతరం అదే అల్లు అర్జున్ హాలీవుడ్‌లో కూడా రాణించాలి అంటూ సీఎం రేవంత్ రెడ్డి పొగడ్తల వర్షం కురిపించడం విశేషం..



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 13.03.2026
www.mudranews.in | @mudranews



## ఐపీఎల్ ప్రారంభం




ఐపీఎల్‌ను 2008లో Lalit Modi ప్రారంభించారు. ప్రపంచంలోనే అత్యంత ప్రాచుర్యం పొందిన క్రికెట్ లీగ్‌లలో ఇది ఒకటి.

# నాణ్యమైన విద్య అందిస్తే పథకాలతో పని లేదు

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హాస్పిటల్ ప్రారంభం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** విద్యను సక్రమంగా అందిస్తే పేదలకు సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. చదువే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతుందన్నారు. అందుకే తమ ప్రభుత్వం విద్య, వైద్యానికి తొలి ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడించారు. గురువారం హైదరాబాద్ లోని కోకాపేట్ లో మెడికవర్ హాస్పిటల్ ను ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. అన్ని వర్గాలకు నాణ్యమైన విద్య ను అందిచాలన్న ఆలోచనతో విద్యా విధానం లో మార్పులు తెస్తున్నట్లు సీఎం తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి నర్సరీ నుంచి 12 తరగతి విధానం తీసుకువస్తామని ప్రకటించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం, భోజనంతో పాటు రవాణా సదుపాయం కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితం గా లేదా 50 శాతం రాయితీతో రవాణా సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు కోసం స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.



ఏ ప్రాంతమైనా అక్కడి మహిళల ఆరోగ్యం బాగుంటే కుటుంబం బాగుంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మంది హెల్త్ డేటాను తయారు చేస్తున్నట్లు వివరించారు. 20 ఏళ్ల ఆరోగ్య శ్రీ డేటా ను ఉపయోగించి డేటా తయారు చేస్తున్నామన్న సీఎం త్వరలోనే మహిళలందరికీ డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేస్తామన్నారు. ప్రజా ప్రభుత్వం క్యాన్సర్ పై ప్రధాన దృష్టి పెట్టిందని చెప్పారు. ఈ అంశంపై అధ్యయనం, లక్ష్యాసాధన కోసమే ప్రముఖ క్యాన్సర్ నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయ ను సలహా దారుడిగా నియమించినట్లు సీఎం తెలిపారు. నిరుపేదలకు వరంగా మారిన ఆరోగ్య శ్రీ,, సీఎంఆర్ ఎఫ్ పథకాల కోసం ఇప్పటి వరకు రూ. 1800 కోట్లు ఖర్చు చేసినట్లు సీఎం వెల్లడించారు. తాజాగా ఉస్మానియా, టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ. 10 వేల కోట్లు ఖర్చు పెడుతున్నట్లు వివరించారు. వైద్యం ఖర్చులు సామాన్యులు భరించలేని విధంగా పెరిగిపోయాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ రంగం లో ఉన్న డాక్టర్లు ఏడాదిలో ఒక నెల ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేయాలని కోరారు. రాష్టంలో కోటి 30 లక్షల కుటుంబాలకు జీవిత బీమా అందించాలని భావిస్తున్నట్లు సీఎం వివరించారు. వైద్యం యాంత్రికంగా ఉండొద్దన్న సీఎం.. మానవత్వం తో కూడిన వైద్య సాయం అందించాలని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకు సూచించారు. దేశంలో హైదరాబాద్ నుంచి 40 శాతం ఫార్మా ఉత్పత్తులు నమోదయ్యాయన్నారు. కరోనా వాక్సిన్ ల్లో మూడు మన జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి కావడం మనకు గర్వకారణమన్నారు.

**దేశంలో.. తెలుగు సినిమాదే కీలక పాత్ర : సీఎం రేవంత్ రెడ్డి**

భారతదేశ సినిమా అభివృద్ధిలో తెలుగు సినిమాదే కీలక పాత్ర అని సీఎం రేవంత్ రెడ్డి కితాబిచ్చారు. ఇది వినోదంతో పాటు మధ్యతరగతి ప్రజలను ప్రభావితం చేస్తుందన్నారు. ఐటీ, ఫార్మాతో పాటు సినిమా ఇండస్ట్రీని కూడా ప్రభుత్వం గొప్ప పరిశ్రమగా భావిస్తోందని సీఎం చెప్పారు. చిత్రపరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. హైదరాబాద్ లోని కోకాపేటలో అల్లు అర్జున్ 'అల్లు సినిమాస్'ను సీఎం రేవంత్ రెడ్డి గురువారం రాత్రి ప్రారంభించారు. స్క్రీన్లను పరిశీలించి.. అల్లు రామలింగయ్య విగ్రహానికి సీఎం నివాళులు అర్పించారు. ఈ ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ తెలుగు సినిమా ఇప్పుడు హాలీవుడ్‌తో పోటీ పడుతోందన్నారు. హాలీవుడ్ సినిమాలు హైదరాబాద్‌లో షూటింగ్ చేసేస్థాయికి తీసుకెళ్లే స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కాలేజీ రోజుల్లో తాను చాలా సినిమాలు థియేటర్లలో చూశానని చెప్పారు. లారీల్లో వెళ్లి సినిమాలు చూసి తిరిగొచ్చేవాళ్లమన్నారు. ఒకప్పుడు సూపర్ స్టార్ కృష్ణ ఏడాదికి నాలుగైదు సినిమాలు తీసేవారన్నారు. ఇప్పుడు స్టార్ హీరోలంతా ఏడాకొకటి, రెండేళ్లకో సినిమా తీస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లోని కృష్ణానగర్ చాలా గొప్ప వ్యక్తులను ఇండస్ట్రీకి ఇచ్చిందన్న సీఎం.. అల్లు అర్జున్ హాలీవుడ్ లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఇప్పటికే ఆయన తన టాలెంట్‌ను దేశంలో ప్రూవ్ చేసుకున్నారని చెప్పారు. హాలీవుడ్ సినిమాలతో పోటీ పడేలా భవిష్యత్ ఉండాలని శుభాకాంక్షలు తెలిపారు.

# అక్కడా.. ఇక్కడా.. సేమ్ టూ సేమ్!

**(మొదటి పేజీ తరువాయి)**

కోర్టు దృష్టికి తీసుకెళ్లా రు. ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించిన స్పీకర్ కార్యాలయానికి అందిన పిటిషన్ లపై ఇప్పటికే పూర్తి స్థాయి విచారణ జరిగిందని, స్పీకర్ ఈ విషయంలో ఒక స్ప ష్టమైన నిర్ణయం తీసుకున్నారని ఆయన ధర్మాసనానికి వివరించారు. స్పీకర్ స్థా యిలోనే ఈ ఫిర్యాదులు పరిష్కారం అయినందున, న్యాయస్థానంలో వీటిపై విచారణ అవసరం లేదన్నారు.

**సుప్రీంకోర్టు నిర్ణయం, కీలక ఆదేశాలు**

న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ సమర్పించిన వివరాలను పరిగణలోకి తీసుకున్న జస్టిస్ సంజ్ కరోల్ ధర్మాసనం, స్పీకర్ కార్యాలయం నుంచి వచ్చిన వివరణతో సంతృప్తి వ్యక్తం చేసింది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్ ఇప్పటికే ఈ వ్యవహారంపై తీర్పు వెలువరించినందున, ఇకపై ఈ పిటిషన్లను విచారణలో ఉంచాల్సిన అవసరం లేదని కోర్టు భావించింది. దీంతో బీఆర్ఎస్ దాఖలు చేసి న ఈ ఫిరాయింపులు పిటిషన్లపై విచారణ ముగిసినట్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే ఈ ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారిస్తూ కోర్టు ఒక కీలక ఆదేశాన్ని జారీ చేసింది. స్పీకర్ తీసుకున్న నిర్ణయానికి సంబంధించిన తీర్పు కాపీలను రాబోయే రెండు రోజుల్లో ఫిర్యాదుదారులకు అందజేయాలని సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశించింది.

**కేసు బ్యాక్ గ్రౌండ్ ఇదే**

తెలంగాణలో ప్రభుత్వం మారిన తర్వాత బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు అధికార పార్టీలోకి వెళ్లడం రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపింది. తమ పార్టీ గుర్తుపై గెలిచి, ఇతర పార్టీల్లోకి వెళ్లిన వారిపై రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పట్టుబట్టింది. ఈ క్రమంలోనే స్పీకర్‌కు ఫిర్యాదు చేయడంతో, న్యాయపరంగా సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించింది. ఇప్పుడు సుప్రీం కోర్టు కేసు విచారణ ముగించి స్పీకర్ నిర్ణయానికే ప్రాధాన్యత ఇచ్చింది. ఇప్పుడు కోర్టు ఆదేశాల మేరకు ఆర్డర్ కాపీలు అందిన తర్వాతే రాజకీయ చదరంగంలో తదుపరి అడుగులు ఎటు పడతాయనేది తేలనుంది.

# వదలం

**(మొదటి పేజీ తరువాయి)**

**క్లీన్ చిట్ నుంచి హైకోర్టు వాల్ వరకు ఏం జరిగింది?**

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో కవితకు సంబంధించి గతంలో ఒక కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసును విచారించిన రౌస్ అవెన్యూ కోర్టు ఇటీవల ఆమెకు క్లీన్ చిట్ ఇచ్చింది. ఈ తీర్పు అరవింద్ కేజ్రీవాల్, కవితతోపాటు చాలా మంది నేతలకు ఊరట ఇచ్చింది. అయితే దర్యాప్తు సంస్థ ఈ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించింది. కోర్టులో తాము సమర్పించిన ఆధారాలను, కేసు తీవ్రతను పరిగణలోకి తీసుకోవాలని సీబీఐ తన అప్పీల్‌లో పేర్కొంది. ఈ క్రమంలోనే దర్యాప్తును మరింత వేగవంతం చేసిన అధికారులు, హైకోర్టు ఆదేశాల మేరకు తాజాగా నోటీసులు జారీ చేశారు. ఆ నోటీసులను కవితకు సీబీఐ అధికారులు ఇచ్చారు.

# వైద్యం బలోపేతం

## రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా

**ముద్ర, సంగారెడ్డి :** రాష్ట్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ వ్యవస్థను అమలు చేస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా వెల్లడించారు. సంగారెడ్డి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నట్లు వివరించారు. గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపకల్పన, అమలుపై రాష్ట్ర, జిల్లా స్థాయి వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమన్వయ సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ సంగారెడ్డి జిల్లాను డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుకు పైలెట్ జిల్లాగా ఎంపిక చేసిన నేపథ్యంలో, ప్రాజెక్టు అమలు విధానం, ముందస్తు ఏర్పాట్లు, అవసరమైన సాంకేతిక సదుపాయాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ పైలెట్ ప్రాజెక్టు అమలులో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని మొత్తం 64 ప్రభుత్వ వైద్యశాలల్లో సేవలు పొందేందుకు వచ్చే ప్రతి రోగికి సంబంధించిన పూర్తి ఆరోగ్య వివరాలతో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ ను రూపొందించి డిజిటల్ హెల్త్ కార్డు జారీ చేయడానికి కసరత్తు చేయాలని మంత్రి ఆరోగ్యశాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు.



సంగారెడ్డి లో అమలు చేయనున్న ఈ పైలెట్ ప్రాజెక్టును అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ హెల్త్ కార్డు అమలులో సంగారెడ్డి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

డిజిటల్ రూపంలో రోగి వైద్య చరిత్ర..

రోగి ఆసుపత్రికి వచ్చిన మొదటి దశ నుంచి చికిత్స పూర్తయ్యే వరకు ఓపీ, మెడికల్ ఆఫీసర్, ల్యాబ్, ఫార్మసీ వంటి అన్ని విభాగాల్లో రోగి వైద్య చరిత్రను డిజిటల్ రూపంలో నమోదు చేసే విధంగా అవసరమైన ఐటీ సదుపాయాలు, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని మంత్రి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు సూచించారు. డిజిటల్ హెల్త్ కార్డు ద్వారా రోగి పూర్తి వైద్య చరిత్ర డిజిటల్ రూపంలో అందుబాటులో ఉండటం వల్ల వైద్యులు తక్షణమే సరైన చికిత్స అందించడానికి సౌలభ్యం కలుగుతుందని మంత్రి తెలిపారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రులలో అందిస్తున్న ఎన్‌సీడీ, కమ్యూనికేబుల్ డిసీజెస్, ఎంసిహెచ్, చైల్డ్ హెల్త్ సేవలు, క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తించి అవసరమైతే రిఫరల్ సిస్టమ్ ద్వారా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో చికిత్స పొందేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు.

# దళిత వాదంతోనే కాంగ్రెస్ ఆవిర్భావం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** సుదీర్ఘ ఘన. చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం దళితవాదంతోనే జరిగిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. దేశంలో అన్ని వర్గాలకు ఒకే రకమైన పాలన అందిస్తోన్న హస్తం.. పార్టీలోనూ సమన్యాయం పాటిస్తోందని చెప్పారు. ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ, సీ, మైనార్టీలకు అండగా హస్తం ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. రెడ్డికి సీఎం, బిసికి పీసీసీ అధ్యక్ష పదవి, దళితులకు డిప్యూటీ సీఎం, స్పీకర్ పదవి, నాలుగు మంత్రి పదవులు కేవలం కాంగ్రెస్ లో మాత్రమే సాధ్యం అన్నారు. 90 ఏళ్ల తర్వాత కుల సర్వే చేసి అఫిషియల్ డాక్యుమెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. గురువారం గాంధీభవన్ లో జరిగిన మాన కొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ టీపీసీసీ ఎస్సీ విభాగ చైర్ పర్సన్ గా పదవి స్వీకార మహోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బరువైన బాధ్యతను నమ్మకంతో సీఎంతో కలిసి కవ్వంపల్లి సత్యనారాయణపై పెట్టామని చెప్పారు. పీసీసీ బలోపేతం కావాలనే ఉద్దేశ్యంతో కవ్వంపల్లి కి పదవి ఇచ్చినట్లు వివరించారు. అధిష్టానం నమ్మకాన్ని కవ్వంపల్లి వమ్ము చేయరనే ధీమా పార్టీలో సీనియర్లందరికీ ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎస్సీ తరపున కవ్వంపల్లికి సూచించిన వారికి ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇస్తామని పార్టీ అధ్యక్షుడు ప్రకటించారు. దళితులు క్లిష్ట సమయాల్లో కాంగ్రెస్ పార్టీ కి అండగా నిలిచారని చెప్పారు. అందుకే తమ పాలనలో దళితులకు, ఆదివాసీలకు, బీసీలకు సముచిత స్థానం కల్పించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. 17 శాతం ఉన్న ఎస్సీలకు 5 ముఖ్యమైన స్థానాలు ఇచ్చామన్నారు. రాబోయే పదవుల పంపకాల్లో ఎస్సీలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. మాజీ సీఎం కేసీఆర్ దళిత నాయకుడు రాజయ్యను అర్ధరాత్రి డిప్యూటీ సీఎం పదవి నుంచి ఎలా తొలగించారో వివరించారు. టిపిసిసి ఎస్సి విభాగం చైర్మన్ కవ్వం పల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి లేకుంటే తానూ ఎమ్మెల్యే గా లేనన్నారు. ఆయన ఆశీస్సులతోనే ఎస్సి విభాగం చైర్మన్ అయ్యాయన్నారు. ఎస్సీ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ప్రస్తుతం రాష్ట్రంలో 19 మంది ఉంటే నలుగురికి రేవంత్ రెడ్డి మంత్రి పదవులు ఇచ్చారన్నారు. సమాజం పట్ల సామాజిక బాధ్యత, సృహ ఉందని సీఎం తనను ప్రోత్సహించారని చెప్పారు. మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి,ఎమ్మెల్యేలు వేముల వీరేశం, లక్ష్మీ కాంత్, యెన్నం శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, నాగరాజు, వినోద్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, ఏఐసీసీ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ఏ సంపత్ కుమార్, పాల్గొన్నారు.

# రైతులకు 24 గంటల విద్యుత్ అబద్ధం

**ముద్ర, మెదక్ :** రాష్ట్రంలో రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నది అబద్ధమని, వాస్తవానికి కేవలం 12 గంటల కరెంట్ మాత్రమే అందుతున్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. గురువారం కోహిర్ మండలంలోని దిగ్వాల్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి లాగ్‌బుక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో రైతులకు 24 గంటల కరెంట్ ఇస్తున్నామని అబద్ధలాడుతున్నారని చెప్పారు. లాగ్‌బుక్‌లను పరిశీలిస్తే కేవలం 13 గంటల విద్యుత్ సరఫరా మాత్రమే నమోదైందన్నారు. అందులో కూడా ఎల్‌సి, లైన్ బ్రేక్, ట్రిప్పింగ్ వంటి సమస్యలు తీసేస్తే రైతులకు 12 గంటల కరెంట్ కూడా సరిగ్గా అందడం లేదని ఆరోపించారు. గత కొద్ది రోజులుగా కోహిర్ ప్రాంత రైతులు విద్యుత్ సరఫరా సరిగా లేదని తమకు ఫోన్ చేసి ఆవేదన వ్యక్తం చేశారని హరీశ్ రావు తెలిపారు. రోజుకు ఐదు నుంచి ఆరు సార్లు కరెంట్ ట్రిప్ అవుతుండడంతో పంటలకు నీరు అందడం లేదని రైతులు బాధపడుతున్నారని చెప్పారు. దిగ్వాల్ సబ్‌స్టేషన్ లాగ్‌బుక్ ప్రకారం ఈ నెల 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు త్రీఫేజ్ కరెంట్ నిలిపివేయగా, 11వ తేదీ ఉదయం 3 గంటలకు మాత్రమే మళ్లీ సరఫరా ప్రారంభమైందన్నారు. అంటే దాదాపు 11 గంటల పాటు కరెంట్ నిలిచిపోయిందని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పాలనలో రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిందన్నారు. కానీ ప్రస్తుతం కేవలం 12 గంటల కరెంట్ మాత్రమే అందుతున్నదని విమర్శించారు. రైతుబంధు, పంటల బీమా, బోనస్ వంటి పథకాలు కూడా అమలు కావడం లేదన్నారు. కేసీఆర్ హయాంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ రూ.4,900కి ఇచ్చామని హరీశ్ రావు చెప్పారు. ప్రస్తుతం దాన్ని రూ.9,700కి పెంచారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది వ్యవసాయ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే వెంటనే మార్పులు చేయడం లేదని విమర్శించారు. మూడో డిస్కం ఏర్పాటు చేసి అప్పులను మళ్లించే ప్రయత్నం జరుగుతుందని హరీశ్ రావు ఆరోపించారు. ప్రస్తుతం డిస్కంలపై రూ.55 వేల కోట్ల అప్పులు ఉన్నాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 19,647 మంది ఆర్టీజెన్స్ ఆరు నెలలుగా సమ్మె చేస్తున్నారని, వారిని వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. చనిపోయిన ఆర్టీజెన్స్ కుటుంబ సభ్యులకు అర్హతల ఆధారంగా ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు వెంటనే 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ కనెక్షన్లు విడుదల చేయడంతో పాటు డబ్బులు చెల్లించిన ఇండ్లకు మీటర్లు ఏర్పాటు చేయాలన్నారు. రైతుబంధు వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున సీఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేస్తున్నామని హరీశ్ రావు తెలిపారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికతో అభివృద్ధి

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాపాలన ప్రగతి ప్రణాలిక ఎంతగానో దోహదపడుతుందని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. వికారాబాద్ పట్టణ కేంద్రంలో నర్సింగ్ ఫంక్షన్ హాల్ నందు 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పై



సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్మన్లకు శిక్షణతో పాటు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైనమిక్ నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన జరుగుతున్నదన్నారు. ప్రభుత్వానికి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు రెండు కళ్ళ లాంటి వారని, అదేవిధంగా బండికి రెండు చక్రాల లాంటి వారని కలిసి పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. పథకాలు సమర్థవంతంగా ప్రజలకు అందాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని స్పీకర్ సూచించారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, తాండూర్ శాసనసభ్యులు బుయ్యాని మనోహర్ రెడ్డి జిల్లా ఎస్పీ స్నేహమేహర, అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, జడ్పీ సీఈవో సుధీర్, డి మంగిలాల్, ఆర్డీవో వాసు చంద్ర, గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజేష్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ లు గడ్డం అనన్య, పట్లోళ్ల నీరజ, రజితలతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
13.03.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ఐపీఎల్ మొదటి ఛాంపియన్**


2008లో జరిగిన తొలి సీజన్‌లో Rajasthan Royals జట్టు విజేతగా నిలిచింది. ఆ జట్టుకు Shane Warne కెప్టెన్‌గా ఉన్నాడు.



# జట్టుగా కొండగట్టుకు..

- అంజన్న ఆశీర్వాద యాత్రకు ఏర్పాట్లు సర్వం సిద్ధం
- వేలాది మందితో బండి సంజయ్ మహా పాదయాత్ర
- ప్రతీ గ్రామంలో భాజా భజంత్రీలతో స్వాగతం
- కనీవిని ఎరగని రీతిలో అట్టహాసంగా యాత్ర
- 14న ఉదయం 6 గంటలకే కొండగట్టు చేరాలా ప్లాన్
- టెన్త్ పరీక్షా విద్యార్ధులకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ చర్యలు
- యాత్ర విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై బీజేపీ నాయకుల కసరత్తు

**ముద్ర, కరీంనగర్:**



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ''అంజన్న ఆశీర్వాద యాత్ర'' పేరిట ఈనెల 14న జరపతలపెట్టిన ''మహా పాదయాత్ర''కు మేము సైతం అంటూ బీజేపీ శ్రేణులు తరలి వెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి. కరీంనగర్ లో రేపు 38 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండబోతున్నట్లు వాతావరణ శాఖ చెబుతున్నా.. అవేవీ లెక్క చేయకుండా 8 గంటల్లో ఏకబిగిన 40 కి.మీల మేరకు కాలినడకన కొండగట్టుకు చేరుకునేందుకు బండి సంజయ్ సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పాదయాత్ర సజావుగా సాగేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై మంగళవారం సాయంత్రం కరీంనగర్ లో బీజేపీ నాయకులు సమావేశమయ్యారు. బీజేపీ సీనియర్ నేత డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల ఇన్చార్జీ భండారి శాంతికుమార్, మోహన్ రెడ్డి, ఆయా జిల్లాల అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపీ, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ కుమార్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎదురయ్యే సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా పదో తరగతి వార్షిక పరీక్షలు జరుగుతున్నందున పాదయాత్ర సందర్భంలో రోడ్డుపై ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకునేలా పోలీసులకు వినతిపత్రం అందజేయాలని నిర్ణయించారు. ఉదయం 6 గంటలకే మహాశక్తి ఆలయానికి చేరుకునేలా మీడియా, సోషల్ మీడియా వేదికగా అందరికీ సమాచారం ఇవ్వాలని నిర్ణయించారు. అంజన్న ఆశీర్వాద యాత్రలో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున హనుమాన్ భక్తులు, బీజేపీ శ్రేణులు, కాషాయ దళం తరలి వచ్చే అవకాశం ఉందని, ఇప్పటికే ''మేం కూడా పాల్గొంటాం'' అంటూ కరీంనగర్ లోని బీజేపీ శ్రేణులు, హిందుత్వ వాదులు, భక్త మండళ్ల సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యుల నుంచి పెద్ద ఎత్తున ఫోన్లు వస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ కుమార్ సమావేశంలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా మనోహర్ రెడ్డి, శాంతి కుమార్ మాట్లాడుతూ ఈ యాత్రలో పాల్గొనే ప్రతి ఒక్కరికీ కేంద్ర మంత్రి బండి సంజయ్ తో కలిసి అడుగులో అడుగు వేసే అవకాశాన్ని కల్పించేలా ఏర్పాట్లు చేయాలని ఆయా జిల్లాల అధ్యక్షులను కోరారు. రాజకీయాలకు అతీతంగా ఆధ్యాత్మిక భావన పెంపొందించేలా భక్తి పాటలు, డీజే సౌండ్, డప్పు సప్పుళ్లతో నభూతో నభవిష్యత్ అనేలా ఈ యాత్రను విజయవంతం చేయాలన్నదే బండి సంజయ్ ఆలోచన అని, అందుకు అనుగుణంగా అన్ని చర్యలు తీసుకుందామని శాంతి కుమార్ తెలిపారు. అంజన్న ఆశీర్వాద యాత్రలో పాల్గొనే వారందరికీ ఎలాంటి ఇబ్బందుల్లేకుండా భోజన, ఇతరత్రా సౌకర్యాలు కల్పించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. అదే సమయంలో మహాశక్తి ఆలయం నుంచి యాత్ర ఆరంభం మొదలు కొండగట్టు అంజన్న ఆలయ సన్నిధికి చేరే వరకు ప్రతి ఒక్కరి మదిలో మెదిలేలా ''అలంకరణ'' ఏర్పాట్లు చేయాలని కూడా నిర్ణయించారు. ప్రతి ఊరిలో, మండల కేంద్రంలో ఈ యాత్రకు భాజా భజంత్రీలతో ఘన స్వాగతం పలికేలా చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

**పాదయాత్ర ప్రారంభమయ్యేదిలా..**

14న ఉదయం 6 గంటలకు కరీంనగర్ లోని మహాశక్తి ఆలయం వద్దకు బండి సంజయ్ చేరుకుంటారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అక్కడికి చేరుకున్న కార్యకర్తలతో కలిసి కొండగట్టుకు కాలినడకన బయలుదేరుతారు. కొత్తపల్లిలో స్థానిక కార్పొరేటర్లు వాసాల రమేశ్, వేముల కవిత చంద్రశేఖర్, హరిప్రసాద్ పాదయాత్రకు ఘన స్వాగతం పలుకుతారు. అక్కడి నుండి రామడుగు, వెదిర, కురిక్యాల మీదుగా గంగాధర చేరుకుంటారు. అక్కడే స్థానిక వీఏఎస్ ఫంక్షన్ హాలులో కాసేపు సేద తీరుతారు. కార్యకర్తలంతా అక్కడే మధ్యాహ్నం భోజనం చేస్తారు. అనంతరం వెంకటయ్యపల్లి, పూడూరు, దొంగలమర్రి, మీదుగా కొండగట్టు ఘాట్ రోడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుండి నేరుగా అంజన్న ఆలయం వద్దకు వెళ్లి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు. దాదాపు 40 కిలోమీటర్ల మేరకు కాలి నడకన వెళ్లి కొండగట్టు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు. మరోవైపు ''అంజన్న ఆశీర్వాద యాత్ర''కు స్వాగతం పలికేందుకు బీజేపీ శ్రేణులు సమాయత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కరీంనగర్ నుండి కొండగట్టు వరకు అడగడుగునా బండి సంజయ్ కు మంగళహారతులు, పూల జల్లులు, వీర తిలకంతో స్వాగతం పలికేందుకు ఆయా ప్రాంతాల ప్రజలు, మహిళలు, కాషాయ సైనికులు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ నుండి కొండగట్టు వరకు పెద్ద ఎత్తున అలంకరణ చేసే పనిలో కాషాయ శ్రేణులు నిమగ్నమయ్యాయి. వేసవికాలం ప్రారంభం కావడంతో దారిపొడవునా పాదయాత్ర చేసే కార్యకర్తలు మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లతోపాటు అవసరమైన మేరకు పులిహోర ప్యాకెట్లను కూడా సిద్ధం చేయనున్నారు. ఈ పాదయాత్రలో పలు స్వచ్ఛంద సంస్థలు, భక్త మండళ్లు సైతం ఈ పాదయాత్రలో పాల్గొనే వారికి తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధమయ్యాయి.



# రైతుల అభివృద్ధే లక్ష్యం

- యాంత్రీకరణ పథకం ద్వారా సబ్సిడీపై ఆధునిక యంత్రాలు పంపిణీ
- మంత్రి దామోదర రాజనర్సింహ

**ముద్ర, సంగారెడ్డి:**

రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించి ఆర్థికంగా బలోపేతం కావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా ఆధునిక వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై అందిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టరేట్ సముదాయ ఆవరణలో ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా రైతులకు మినీ ట్రాక్టర్లను రాష్టమంత్రి దామోదర్ రాజనర్సింహ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు ఎస్సీ, ఎస్టీ రైతులకు ఒక్కోటి రూ.4.9 లక్షల విలువ గల 20 హెచ్‌పి కెపాసిటీ మినీ ట్రాక్టర్లను 60 శాతం సబ్సిడీతో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వ్యవసాయం, ఉద్యాన రంగాల అభివృద్ధికి యాంత్రీకరణ ఎంతో అవసరమని పేర్కొన్నారు. చిన్న, సన్నకారు రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. రైతులు ఆధునిక పద్ధతులు, యంత్రాలను వినియోగించి సాగు ఖర్చును తగ్గించుకోవడంతో పాటు ఉత్పాదకతను పెంచుకోవాలని సూచించారు. రైతుల ఆర్థికాభివృద్ధి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని, రైతులకు అండగా ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సోమేశ్వరరావు, డీఆర్‌డీఓ జ్యోతి తదితర జిల్లా అధికారులు, సంబంధిత లబ్ధిదారులు పాల్గొన్నారు.

## వెల్ఫేర్ అసోసియేషన్ నేత అంజిరెడ్డి కన్నుమూత

**ముద్ర, న్యూస్ బ్యూరో**



మెహిదీపట్నం: నేతాజీ నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, సంఘ సేవకుడు అంజిరెడ్డి బుధవారం రాత్రి కన్నుమూశారు. ఆయన వయస్సు 73 సంవత్సరాలు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ సీడ్స్ కార్పొరేషన్ లో అధికారిగా పనిచేసిన అంజిరెడ్డి మొదటి నుంచీ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. సీడ్స్ కార్పొరేషన్ ఉద్యోగ సంఘాల నాయకుడుగా కూడా ఆయన పని చేశారు. నేతాజీ నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కు గత పదిహేనేళ్లుగా ఆయన వివిధ హోదాలలో సేవలు అందిస్తూ కాలనీ అభివృద్ధికి కృషి చేశారు. గత కొద్ది కాలంగా అస్వస్తులుగా ఉన్న అంజిరెడ్డి బుధవారం రాత్రి ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో కన్నుమూశారు. ఆయన పార్థివ దేహానికి గురువారం సాయంత్రం మహాప్రస్థానం స్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి. అసోసియేషన్ అధ్యక్షుడు జి అప్పారావు, ప్రధాన కార్యదర్శి జగన్మోహన్ రెడ్డి, మాజీ అధ్యక్షులు టిఎస్ ఆనందరెడ్డి, ఎ సత్యం బాబు, అసోసియేషన్ నాయకులు ఏ కృష్ణమూర్తి, వై నరేందర్ రెడ్డి, కే వి బి మురళీ మోహన్ రావు, ఏం రంగారెడ్డి, కే శ్రీధర్ రావు, అమర్నాథ్ రెడ్డి, ఉమేష్ కుమార్, వై రవీందర్ రెడ్డి, ఎల్ దామోదర్, ఏ ఆంజనేయస్వామి, డాక్టర్ వరప్రసాద రావు, సీనియర్ జర్నలిస్టు శ్రీహరి రెడ్డి అంజి రెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.




# ఆర్థికంగా ఎదగాలి

**ముద్ర, ఖమ్మం:**

మైనారిటీ మహిళలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మంత్రి గురువారం కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో మస్జిద్ కమిటీలకు రంజాన్ గిఫ్ట్ పాకెట్స్, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద ముస్లిం మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా.. పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని మైనారిటీ సోదరులు ఒక్క పొద్దులు రోజా ఉంటూ అల్లాను ప్రార్థిస్తూ, సర్వ మత ప్రజలందరూ చల్లగా ఉండాలని ప్రార్థనలు చేస్తూ, పవిత్రమైన మనస్సు చాటుతున్నందుకు అభినందనలు తెలిపారు. అల్లా మైనార్టీ సోదరుల కోరిక తీర్చాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి పేదవానికి అండదండలుగా ఉంటూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, ప్రతి నియోజకవర్గ పరిధిలో సుమారు 200 కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్నామని అన్నారు. మైనారిటీ సోదరీమణులు కుట్టు మిషన్లతో వారి నైపుణ్యాన్ని ఉపయోగించి ఆర్థికంగా ఎదగాలని అన్నారు. మహిళలు కూడా సంపాదించడం ప్రారంభించిన తర్వాత కుటుంబాలు మరింత ఆర్థికంగా స్థిరపడతాయని అన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ నెలలో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం పాలేరు నియోజకవర్గానికి చెందిన 163 మంది ముస్లిం మైనారిటీ మహిళా లబ్ధిదారులకు కుట్టు మిషన్లను, కూసుమంచి మండల మస్జిద్ కమిటీలకి 350 రంజాన్ గిఫ్ట్ పాకెట్స్ లను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజక వర్గ ప్రత్యేక అధికారి రమేష్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మోడల్ కాలనీగా వెలుగుమట్ల

- ధనార్జన కోసం దళారులు అడుగుపెట్టారు..
- ప్రజలను మోసం చేసిన వారిని విడిచి పెట్టం
- భూదాన్ భూముల్లో 38 ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**ముద్ర, ఖమ్మం:**



'వెలుగుమట్ల'ను తెలంగాణ రాష్ట్రంలోనే మోడల్ కాలనీగా తీర్చి దిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం వెలుగుమట్ల భూదాన్ భూములలో 38 ఇళ్ల నిర్మాణ పనులకు ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరికం ఆసరా చేసుకొని ధనార్జన కోసం దళారులను అడ్డుపెట్టి ఇతర జిల్లా, రాష్ట్రాల వారిని రెచ్చగొట్టి ఫేక్ డాక్యుమెంట్ లతో భూమి పేదలకు మోసపూరితంగా అప్పగించారని తెలిపారు. 1953 లో ఆసామి 31 ఎకరాల 7 గుంటల భూమి దానం చేశారని తెలిపారు. గత 8 సంవత్సరాల కాలంలో అనేక సమస్యలు పేదలు ఎదుర్కొన్నారని, తాగునీటి, విద్యుత్ సరఫరా వంటి సదుపాయాలు కల్పన లేకుండా బాధలు పడ్డారని తెలిపారు. కరెంట్, మంచి నీరు ప్రతి అంశానికి డబ్బులు డిమాండ్ చేస్తూ మాఫియా నడిపించారని మంత్రి తెలిపారు. పేదలను దిన దిన గండం నుంచి కాపాడాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించిందని అన్నారు. భూ దాన్ భూములు ఆక్రమించుకోవాలని సిసిఎల్ఏ ఇచ్చిన ఆదేశాల ప్రకారం కూల్చివేతలు జరిగాయని అన్నారు. మోడల్ కాలనీగా వెలుగుమట్లను తీర్చి దిద్దుతామని, తెలంగాణ రాష్ట్రాన్ని ప్రసాదించిన తల్లి సోనియాగాంధీ పుట్టిన రోజు డిసెంబర్ 9 నాటికి కాలనీ పూర్తి చేస్తామని తెలిపారు. పేదలకు పంచిన తర్వాత మిగిలిన భూమిలో స్కూల్, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అన్నారు. నిరుపేదలకు సున్నా వడ్డీతో రుణాలు అందిస్తామని తెలిపారు. పేదలకు ఇంటి నిర్మాణంలో హౌసింగ్ శాఖ సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. వెలుగుమట్ల లేఔట్ లో కరెంటు పోల్స్, విద్యుత్ సరఫరా పనులు యుద్ధ ప్రాతిపదికన ఉగాది లోపు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా త్రాగునీటి పైప్ లైన్ పనులు చేపట్టాలన్నారు. దళారులకు ఎవరు ఎంత డబ్బులు ఇచ్చారు వివరాలు పోలీసు అధికారులకు అందించాలని అన్నారు. ప్రజలను మోసం చేసిన ఎవరిని విడిచి పెట్టే సమస్య లేదని కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, హౌజింగ్ పిడి శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బలహీన ప్రధాని మోడీ

- యుద్ధ ప్రభావంతో పెరిగిన ధరలు
- సీపీఐ జాతీయ నాయకులు నారాయణ
- కమ్యూనిస్టులను బలహీనపర్చడమే వారి ధ్యేయం కూనంనేని

**ముద్ర, ఖమ్మం:**




ప్రపంచంలోనే అత్యంత బలమైన ప్రజాస్వామ్య పునాధులున్న భారతదేశానికి మోడీ అత్యంత బలహీన ప్రధాని అని, సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ ఆరోపించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు సాగిలపడటం తప్పా.. మోడీ మరేపని చేయలేక పోతున్నారని ఆరోపించారు. ఇందిరాగాంధీకి ఉన్న ధైర్యంలో 5 శాతం కూడాలేదని అన్నారు. గురువారం స్థానిక గిరిప్రసాద్ భవన్ లో జరిగిన మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడుతూ.. భారతదేశంపై యుద్ధ ప్రభావంతో నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగి పోతున్నాయని అన్నారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ ఆర్థిక వనరులున్న దేశాలపై దాడులు చేసి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని వెనుజులా తరువాత ఇరాన్పై యుద్ధం చేస్తున్నాడని, క్యూబా పై కూడా దాడికి ప్రయత్నచేస్తున్నాడని తెలిపారు. ట్రంపు చూసి మోడీ బయపడుతున్నాడని 140 కోట్లమంది దేశ ప్రజల ఆత్మగౌరవాన్ని ట్రంప్ క్కుమోడీ తాకట్టుపెట్టారన్నారు. వ్యక్తులుగా చంపి తాత్కాలికంగా ఆనందం పొందవచ్చు కానీ సిద్ధాంతాన్ని చంపలేరని నారాయణ గుర్తు చేశారు. ఖమ్మం వెలుగుమట్ల ఘటనపై స్పందిస్తూ.. భూ స్వామ్య భూములను కమ్యూనిస్టులు ఆక్రమించే క్రమంలోనే భూదాన్ ఉద్యమం వచ్చిందన్నారు.

**కమ్యూనిస్టులను బలహీనపర్చలేరు: కూనంనేని**

కమ్యూనిస్టులను బలహీన పర్చడమే వారిధ్యేయమని అందుకే కమ్యూనిస్టులపై అనవసర విమర్శలు చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. పాల్వంచలో సీపీఐ ప్రజా ప్రతినిధులకు ఈ నెల 13,14 తేదీల్లో నిర్వహించే శిక్షణా తరగతులకు జాతీయ నాయకులు కె.నారాయణ, పల్లా వెంకటరెడ్డి, కె.రామకృష్ణ హాజరవుతారని తెలిపారు.



# సీనియర్ ఏఓ ఖదీర్ అరెస్ట్

**ముద్ర, మోత్కూర్:**

మోత్కూర్ ఎస్ టీవో కార్యాలయంపై గురువారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి సీనియర్ ఏఓ ఎండీ ఖాదిర్ పై కేసు నమోదు చేశారు. వేతనం గురించి సీనియర్ అకౌంటెంట్ ఆఫీసర్ ఎండి ఖదీర్ రూ.10 వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు దారుడు ఎంపీఓ జనార్దన్ రెడ్డి తెలిపారు. ఎంపీఓ జనార్దన్ రెడ్డి ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. ఎస్ టీవో కార్యాలయం తో పాటు ఎండీ ఖదీర్ స్వస్థలం భువనగిరిలోని ఆయన ఇంటిపై ఒకేసారి దాడులు నిర్వహించారు. ఖదీర్ ను అరెస్టు చేసి హైదరాబాద్ లోని అదనపు ఏసీబీ కేసుల విచారణ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచి నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
13.03.2026 శుక్రవారం, హైదరాబాద్



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744



## నవ్వుల బాటలో నడుద్దాం – నూరేళ్ల జీవితం బ్రతుకుదాం


బాగా బ్రతుకుదాం —
బంగారు భావాలతో మనసును
నింపుదాం,
మనుగడకు మాధుర్యమై
మనసుల మధ్య మమకారం చల్లుదాం.
నిలకడగా బ్రతుకుదాం —
నీతిమార్గాన్ని నడకగా చేసుకుందాం,
అడుగడుగునా ధైర్యంగా
అర్థవంతమైన అడుగులు వేద్దాం.
నిశ్చింతగా బ్రతుకుదాం —
నేటి క్షణాలను నిధిగా భావించుదాం,
గతపు గాయాలను గాలిలో కలిపి
రేపటిని చిరునవ్వులతో ఆహ్వానిద్దాం.
నిర్భయంగా బ్రతుకుదాం —
నిజం అనే కవచం ధరించుదాం,
న్యాయం అనే దీపంతో
అంధకారాల్ని పారదోలుదాం.
నిజాయితీగా బ్రతుకుదాం —
మనసుకు మనమే సాక్షులమవుదాం,
మాటల్లో మాధుర్యాన్ని
చర్యల్లో చైతన్యాన్ని నింపుకుందాం.
నిగర్విగా బ్రతుకుదాం —
విజయాల్ని వినయంగా ధరించుదాం,
మనిషితనమును ముద్దాడుతూ
మానవత్వమునకు మకుటమై నిలుద్దాం.
నిర్మొహమాటంగా బ్రతుకుదాం —
నిజం చెప్పే నిబ్బరంతో మెలుగుదాం,
న్యాయానికి నిత్య దీపమై
జీవిత గృహంలో వెలిగించుదాం.
నవ్వుతూ బ్రతుకుదాం —
చిరునవ్వుల చినుకులతో గడుపుదాం,
చుట్టూ ఉన్న చీకట్లను చెదరగొట్టి
ఆనందాన్ని అక్షరాలా పంచుదాం.
నిండునూరేళ్లు బ్రతుకుదాం —
నిరంతర ప్రేమల పూలను చల్లుదాం,
సార్థక జీవన గీతాన్ని ఆలపిస్తూ
సుగంధ జ్ఞాపకాలై మిగిలిపోదాం.
బ్రతకటం అంటే
కాలం గడపటం కాదు —
మనసులు తాకే
ముద్దైన మానవత్వం చాటటం.
నవ్వు పెట్టుబడి పెడితే —
ఆనందం వడ్డీగా వస్తుంది;
మనసు మమకారం పంచితే —
మానవత్వం లాభంగా
మిగులుతుంది.



గుండ్లపల్లి
రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం.

# రాజకీయ,సాహిత్య సవ్యసాచి బూర్గుల

- మార్చి 13 బూర్గుల రామకృష్ణారావు జయంతి



అపర చాణక్యుడిగా గుర్తింపు పొందిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు గురువు ఆయన. హైదరాబాద్ రాష్ట్రానికి ప్రజల ద్వారా ఎన్నికైన మొట్టమొదటి, చిట్టచివరి ముఖ్యమంత్రి కూడా ఆయనే. న్యాయవాదిగా, బహుభాషావేత్తగా,స్వాతంత్ర్య సమరయోధుడిగా, రాజనీతిజ్ఞుడిగా డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు పాత్ర హైదరాబాద్ చరిత్రలో చిరస్మరణీయమైనది.

**ఉద్యమకారుడు, పాలమూరు ముద్దుబిడ్డ బూర్గుల రామకృష్ణారావు.**

రామకృష్ణారావు గారి ఇంటి పేరు పుల్లమరాజు. వీరి గ్రామం బూర్గుల. ఆ ఊరి పేరే వీరికి ఇంటి పేరుగా స్థిరపడిపోయింది. బూర్గుల వారు 1899 జిల్లా పడకల గ్రామంలో వారి అమ్మమ్మ గారింట జన్మించారు. పుల్లమరాజు నర్సింగరావు, రంగనాయకమ్మ వీరి తల్లి దండ్రులు. బూర్గుల వారి పూర్వీకులు జాగిర్దారులుగా, పండితులుగా ప్రసిద్ధికెఎక్కారు.

బూర్గుల వారి విద్యాభ్యాసం మొదట వీధిబడిలో మొదలైంది. తర్వాత హైదరాబాదులోని ధర్మవంత్ పాఠశాలలో మాధ్యమిక విద్యను,బొంబాయి విశ్వవిద్యాలయం నుండి మెట్రిక్యులేషన్,నిజాం కాలేజీలో ఇంటర్ విద్యను, పూణేలోని ఫెర్గుసన్ కాలేజీలో బి.ఏ ను పూర్తిచేశారు. అటు పిమ్మట బొంబాయి విశ్వవిద్యాలయంలో న్యాయ శాస్త్రన్ని అభ్యసించి ఎల్.ఎల్.బి పట్టా పొందారు. ఆయనకు తెలుగుతో పాటు ఇంగ్లీషు, ఉర్దూ,పార్సీ, సంస్కృతం, మరాఠీ,కన్నడం, మలయాళీ భాషల్లో మంచి పరిజ్ఞానం ఉంది ఆయా భాషల్లో రచనలు కూడా చేశారు. బూర్గుల వారికి పదమూడు ఏండ్ల వయసులోనే అప్పటి సంప్రదాయం ప్రకారం పెళ్లి అయింది కొంతకాలానికి భర్య చనిపోవడంతో మరొక వివాహం చేసుకున్నారు.

హైదరాబాదులో న్యాయవాద వృత్తిని ప్రారంభించిన బూర్గుల వారు పేదల పక్షాన నిలిచి కోర్టులో వాదించి సమర్థుడైన న్యాయవాదిగా పేరుపొందాడు. ధన సంపాదన కాకుండా ప్రజాహితమే లక్ష్యంగా తన అనన్యమైన వాదన పటిమతో కేసులు వాదించేవాడు ఆ రోజుల్లో న్యాయవాద వృత్తిలో ఉండే వారంతా బూర్గుల వారి నిష్ణాతనమైన సునిశిత మేధాసంపత్తికి ఆశ్చర్యపోయే వారు. అపర చాణక్యుడిగా కీర్తించబడిన పీ.వీ.నరసింహారావు బూర్గుల వారి వద్ద జూనియర్ గా పనిచేసే ఎంతో నేర్చుకున్నాడు. బూర్గుల రామకృష్ణారావు ప్రతిభ విశేషాలు గుర్తించిన నాటి హైదరాబాదు దివాన్ (ప్రధానమంత్రి) సర్ మీర్జా ఇస్మాయిల్ ఆయనకు హైకోర్టు న్యాయమూర్తిగా, న్యాయశాఖాధిపతిగా పదవిని ఇవ్వజూపగా తిరస్కరించాడు. అది వారి ప్రజాపక్షపాతానికి, దేశభక్తికి నిదర్శనం. న్యాయవాదిగా ఉంటూనే అంధ్రోద్యమం,

గ్రంధాలయోధ్యమం, భుదానోద్యమాలలో పాల్గొన్నాడు. బ్రిటిష్ వారి పాలనను నిరసిస్తూ క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు కెళ్ళాడు. ఆ విధంగా అనేక ఉద్యమాలలో పాల్గొన్న ఉద్యమకారుడు మనం బూర్గుల.

హైదరాబాద్ రాష్ట్రంలో 1948 లో పోలీసు చర్య జరిగిన తర్వాత భారత ప్రభుత్వంచే ముఖ్యమంత్రిగా నియమించబడిన ఎంకె.వెల్లోడి ప్రభుత్వంలో బూర్గుల వారు రెవిన్యూ, విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. అప్పుడే ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టాడు. హైదరాబాదు రాష్ట్రంలో మొదటిసారిగా 1952లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో షాద్ నగర్ నుండి కాంగ్రెస్ శాసన సభ్యుడిగా గెలిచి ముఖ్యమంత్రిగా ఎన్నుకోబడ్డారు. ఆ విధంగా ప్రజల తీర్పుతో ప్రజాస్వామ్యబద్ధంగా హైదరాబాద్ రాష్ట్రానికి ఎన్నికైన తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయారు. ముఖ్యమంత్రిగా ఆయన చేపట్టిన భూసంస్కరణలు దేశానికే ఆదర్శవంతమైనాయి. హైదరాబాద్ రాష్ట్రంలో తరతరాల నుండి వస్తున్న జాగీర్దారు వ్యవస్థను రూపుమాపారు.కౌలుదారీ చట్టాన్ని తీసుకువచ్చారు. వినోబాభావే ప్రారంభించిన భూదానోద్యమానికి చట్టబద్ధత కల్పించారు.

విద్యారంగంలో కూడా అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. అప్పటివరకు తెలుగు వారికి ఉర్దూ బోధన భాషగా ఉండేది. దానిని రద్దు చేసి తెలుగు మాధ్యమంలో విద్యాబోధన ప్రారంభించారు.అధికార భాషగా తెలుగుకు ప్రాధాన్యం కల్పించారు. గ్రామాల్లో అనేక విద్యాసంస్థలు ఏర్పాటు చేశారు. ప్రతి జిల్లాకు కళాశాలను ఏర్పాటు చేశారు. వయోజన విద్యకు,స్త్రీవిద్య వ్యాప్తికి కృషి చేశారు.ప్రజల సౌకర్యార్థం వరంగల్ నుండి ఖమ్మం ప్రాంతాన్ని వేసి ఖమ్మం జిల్లాను ఏర్పాటు చేశారు. మొట్టమొదటిసారిగా హైదరాబాదు రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖను ఏర్పాటు చేశారు.

బూర్గుల వారు గొప్ప పరిపాలకుడే కాక సాహితీవేత్త కూడా సంస్కృతంలో శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం, శ్రీ శృంగగిరి శారదాకృతి, శ్రీరామస్తవం, తెలుగులో కృష్ణశతకం పుష్పాంజలి తోకచుక్క మొదలైన పద్యకవితలను, అనువాద రచనలు, సాహితీ వ్యాసాలను, ఎన్నో గ్రంథాలకు పీఠికలను రాశారు. ఇంగ్లీషులో కూడా ఎన్నో కవితలు రాశారు. పారశిక వాఙ్మయ చరిత్రను రాశారు.ఒక రాజకీయవేత్తలో ఇంత గొప్ప సాహితీవేత్త ఉండడం చాలా అరుదు. అందుకే మహాకవి దాశరథి సాంస్కృత శ్లోకం, పారశీ, గజల్ తెలుగు పద్యం, వెరసి బూర్గుల" అని బూర్గుల వారిని విమర్శించారు.

తనకు వ్యక్తిగతంగా ఇష్టం లేకపోయినా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సూచన మేరకు తెలంగాణ,ఆంధ్ర రాష్ట్రాలు కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడడానికి మద్దతు ఇచ్చి తన పదవిని త్యాగం చేశారు ఆ తర్వాత కేరళ రాష్ట్రానికి,ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి గవర్నర్ గా పనిచేసారు.రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు.

విశిష్టమైన వ్యక్తిత్వం ఉదారత్వం కలిగిన వ్యక్తిగా సుపరిపాలన శక్తిగా ఎదిగిన బూర్గుల రామకృష్ణారావు గారు 1967 సెప్టెంబర్ 14న గుండెపోటుతో కన్నుమూశారు.

- సుధాకర్.ఏ.వి
- రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
- స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)
- 9000674747





## సుప్రీంకోర్టు చీవాట్లతోనైనా
# సర్కారు కళ్లు తెరిచేనా?

**ప్యాక్ చేసిన ఆహారంపై నిజాలను దాచడం నేరం కాదా? ప్రజల ప్రాణాల కంటే కార్పొరేట్ లాభాలే మిన్ననా?**

భారతదేశం ప్రస్తుతం ఒక తీవ్రమైన ప్రజారోగ్య సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అంటువ్యాధులను కొంతవరకు అదుపులోకి తెచ్చుకున్నప్పటికీ, అతిగా శుద్ధి చేసిన ఆహార పదార్థాలు 'జీవనశైలి వ్యాధులను' వేగంగా పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 10న సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు వ్యవస్థలను హెచ్చరించేలా ఉన్నాయి. ముందస్తుగా నిల్వ చేసే ఆహార పదార్థాలపై పొట్లం ముందు భాగంలో హెచ్చరిక గుర్తులు పెట్టే విషయంలో ఆహార భద్రత ప్రమాణాల సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రజల ఆరోగ్య రక్షణ కంటే కంపెనీల లాభాలే ప్రభుత్వానికి ముఖ్యమైపోయాయనే సందేశం దీనిలో దాగి ఉంది.

**నక్షత్రాల రేటింగ్‌పై విమర్శలు**

కొన్నేళ్లుగా చర్చల్లో ఉన్న 'పోషక విలువల నక్షత్రాల రేటింగ్' విధానం వినియోగదారులను తప్పుదారి పట్టించే ప్రమాదం ఉందని విమర్శలు ఉన్నాయి. అధిక చక్కెర, ఉప్పు వంటి హానికర పదార్థాలను దాచిపెట్టి, ఇతర పోషకాల ఆధారంగా నక్షత్రాల గుర్తులు ఇవ్వడం వల్ల సాధారణ ప్రజలు ఆ ఉత్పత్తులను ఆరోగ్యకరమైనవిగా భావించే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు, ఎక్కువ చక్కెర ఉన్న పదార్థానికి కూడా కొంత పండ్ల రసం ఉండటం వల్ల మంచి రేటింగ్ రావడం వినియోగదారులలో అపోహలు కలిగించవచ్చు.

**చిన్న వయసులోనే ఆరోగ్య సమస్యలు**

ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల వినియోగం పెరగడం వల్ల చిన్నారుల్లో ఊబకాయం, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలు పెరుగుతున్నాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తక్కువ ధరలో లభించే చిరుతిళ్లు, పానీయాల్లో అధిక ఉప్పు, చక్కెర, రసాయనాలు ఉండటం దీనికి ప్రధాన కారణం. అందుకే ఆహార పొట్లాలపై స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పలువురు నిపుణులు సూచిస్తున్నారు.

**స్పష్టమైన హెచ్చరికల అవసరం**

ప్రస్తుతం ఆహార పొట్లాల వెనుక భాగంలో చిన్న అక్షరాలతో ఇచ్చే పోషక విలువల వివరాలు చాలామందికి అర్థం కావడం కష్టం. దీనికి బదులుగా చిలీ, మెక్సికో వంటి దేశాల్లో ఉన్నట్లుగా ముందుభాగంలో స్పష్టమైన హెచ్చరిక గుర్తులు ఉంటే వినియోగదారులు సులభంగా ప్రమాదాన్ని గుర్తించగలరు. సరైన సమాచారం అందితే వినియోగదారులు ఆరోగ్యానికి మేలు చేసే నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది.


**ప్రభుత్వానికి పరీక్షా సమయం**

ప్రజల ఆరోగ్యం రక్షించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత. సుప్రీంకోర్టు సూచనలను దృష్టిలో ఉంచుకుని, ఆహార పొట్లాలపై స్పష్టమైన హెచ్చరిక గుర్తుల అమలుపై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజల ప్రాణాలకు ప్రాధాన్యం ఇస్తూ పారదర్శక విధానాలు అమలు చేస్తేనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుంది.



వెంక గారి
భూమయ్య
సీనియర్
జర్నలిస్ట్
9848559863

## నెత్తురు చిందిన నేలపై రంజీ సెగ..
# లోయలో క్రీడా స్ఫూర్తి





దేశవాళీ క్రికెట్ సమరంలో కనీవినీ ఎరుగని అద్భుతం ఆవిష్కృతమైంది. ముంబయి, ఢిల్లీ, తమిళనాడు వంటి బలమైన జట్లు తడబడిన చోట అందరి అంచనాలను తలకిందులు చేస్తూ 'అండర్ డాగ్'గా బరిలోకి దిగిన జమ్మూ కాశ్మీర్ జట్టు రంజీ ట్రోఫీని ముద్దాడి చరిత్ర సృష్టించింది. హుబ్బళ్లిలోని కేఎస్‌సీఏ మైదానంలో కర్ణాటకతో జరిగిన ఫైనల్లో వీరోచిత ప్రదర్శనతో 67 ఏళ్ల నిరీక్షణకు తెరదించింది.

అశాంతి, ఉగ్రవాద ముప్పు, పరిమిత మౌలిక సదుపాయాల మధ్య పెరిగిన ఈ ఆటగాళ్లు క్రికెట్‌పై ఉన్న అభిరుచితో అసాధారణ విజయం సాధించారు. 1959-60లో రంజీ ప్రయాణం మొదలుపెట్టిన ఈ జట్టు ఇప్పుడు ఛాంపియన్‌గా నిలవడం భారత క్రికెట్ చరిత్రలో ప్రత్యేక ఘట్టంగా నిలిచింది. ఫైనల్లో కర్ణాటకపై ఒత్తిడిని అధిగమించి ఆడిన తీరు జట్టు ధైర్యాన్ని చాటింది.

**బెంగాల్‌ను వేటాడి.. కర్ణాటక కోటను కూల్చి**

ఈ సీజన్‌లో జమ్మూ కాశ్మీర్ విజయ ప్రస్థానం అప్రతిహతంగా సాగింది. లీగ్ దశలో గ్రూప్-డి నుంచి ముందుకు వచ్చిన ఈ జట్టు క్వార్టర్ ఫైనల్లో మధ్యప్రదేశ్‌ను ఓడించింది. సెమీఫైనల్లో బెంగాల్‌ను 99 పరుగులకు కట్టడి చేసి ఫైనల్ చేరింది.

ఫైనల్లో 8 సార్లు ఛాంపియన్ అయిన కర్ణాటకపై తొలి ఇన్నింగ్స్‌లో 584 పరుగులు చేసి ఆధిపత్యం చాటింది. శుభమ్ పుండిర్ సెంచరీ చేయగా, ఆకిబ్ నబి 5 వికెట్లతో కర్ణాటకను 293 పరుగులకే పరిమితం చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఖమ్రాన్ ఇక్బాల్ (160), సాహిల్ లోత్రా (101*) సెంచరీలతో భారీ ఆధిక్యాన్ని సాధించి చారిత్రక విజయాన్ని ఖాయం చేశారు.

**ఆకిబ్ నబి... కశ్మీర్ ఎక్స్‌ప్రెస్**

ఈ విజయానికి ప్రధాన శిల్పి యువ స్పీడ్ స్టార్ ఆకిబ్ నబి. కేవలం 10 మ్యాచ్‌ల్లోనే 60 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. ఫైనల్లో 5 వికెట్లు తీసి జట్టు విజయానికి కీలక పాత్ర పోషించాడు. అతని ప్రతిభను గుర్తించిన ఢిల్లీ క్యాపిటల్స్ ఐపీఎల్ వేలంలో రూ.8.4 కోట్లకు కొనుగోలు చేసింది.

బ్యాటింగ్‌లో అబ్దుల్ సమద్ (748 పరుగులు), కెప్టెన్ పారస్ డోగ్రా (551) కీలక పాత్ర పోషించారు. సునీల్ కుమార్, అబిద్ ముస్తాక్, యుధ్వీర్ సింగ్ బౌలింగ్‌లో తోడ్పాటునిచ్చారు. కోచ్ అజయ్ శర్మ మార్గదర్శకత్వం ఈ జట్టును విజేతలుగా తీర్చిదిద్దింది.

**రంజీ విజయం.. ఒక సామాజిక విప్లవం**

జమ్మూ కాశ్మీర్ రంజీ విజయం కేవలం క్రీడా విజయమే కాదు, ఒక సామాజిక మార్పుకు సంకేతం. ఒకప్పుడు తుపాకీ శబ్దాలతో మారుమోగిన లోయలో ఇప్పుడు క్రికెట్ ప్రతిభ వెలుగుతోంది. ఆకిబ్ నబి వంటి ఆటగాళ్లు కర్ఫ్యూలు, బంద్లు మధ్య సాధన చేసి ఈ స్థాయికి చేరుకున్నారు.


మౌలిక సదుపాయాల కొరత, మంచుతో మూసుకుపోయే మైదానాలు, ప్రతికూల పరిస్థితుల మధ్య సాధించిన ఈ విజయం కశ్మీరీ యువత పట్టుదలకు నిదర్శనం.

**శాంతి దిశగా కొత్త అడుగు**

జమ్మూ కాశ్మీర్ క్రికెట్ అసోసియేషన్‌లో వచ్చిన మార్పులు, మెరిట్ ఆధారిత ఎంపికలు, ప్రభుత్వ ప్రోత్సాహం ఈ విజయానికి బలం అయ్యాయి. పర్వేజ్ రసూల్, ఉమ్రాన్ మాలిక్, అబ్దుల్ సమద్ వంటి ఆటగాళ్ల విజయాలు యువతకు ప్రేరణగా నిలుస్తున్నాయి.

ఈ రంజీ ట్రోఫీ కేవలం ఒక కప్పు కాదు; కాశ్మీర్ లోయలో వికసిస్తున్న శాంతి సంకేతం. గల్లీగల్లీలో క్రికెట్ అకాడమీలు పెరిగి, మరిన్ని ప్రతిభలు వెలుగులోకి రావాలని ఆశిద్దాం. జమ్మూ కాశ్మీర్ అజేయ ప్రస్థానం భారత క్రీడా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

సంపాదకీయం: దిడ్డి శ్రీకాంత్
జర్నలిస్ట్, హైదరాబాద్
(8686865759)



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
13.03.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews
5
దక్షిణ తెలంగాణ
హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్
Hyderabad, Rangareddy, Mahabubnagar



**ఐపీఎల్ అత్యధిక టైటిళ్లు**

ఐపీఎల్‌లో ఎక్కువ ట్రోఫీలు గెలిచిన జట్టు ముంబై ఇండియన్స్. ఈ జట్టును రోహిత్ శర్మ అనేక సార్లు విజేతగా నడిపించాడు.



## అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

**ముద్ర, కాప్రా :**

కాప్రా డివిజన్ పరిధిలోని తిరుమల శివపురి కాలనీలో రూ. కోటి 48 లక్షల 50 వేల వ్యయంతో బీటీ రోడ్ల నిర్మాణం, శాలివాహన కాలనీలో రూ. 95 లక్షల వ్యయంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్, సీఎస్ నగర్‌లో రూ. 30 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. కాలనీల్లో రోడ్లు, డ్రైనేజ్ వంటి సమస్యలను దశలవారీగా పరిష్కరించి ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బైరీ నవీన్, కాలనీ ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



**ముద్ర, కూకట్‌పల్లి :**

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వాంబే గృహ సముదాయంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న డ్రైనేజీ సమస్యకు పరిష్కారం లభించనుంది. రూ. 37.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టబోయే నూతన భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జలమండలి అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కాలనీలో నిత్యం డ్రైనేజీ పొంగిపొర్లడం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి, ప్రత్యేక చొరవతో ఈ నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం హరీష్, డీజీఎం శ్రీనివాస రాజు, మేనేజర్ ఝాన్సీ, స్థానిక నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



**ముద్ర, నారాయణపేట:**

పదో తరగతి విద్యార్థులకు పాఠశాలలో నిర్వహించే స్వపరిపాలన దినోత్సవం ఓ మధురానుభూతి.. వీడ్కోలు సమావేశం పదేళ్ల తమ బాల్యదశలో మరచిపోలేని మధుర ఘట్టం. ఇలాంటి మధురానుభూతుల్లో ఒకటైన స్వపరిపాలన దినోత్సవాన్ని పట్టణంలోని శ్రీ హంసవాహిని స్కూల్‌లో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌గా నందిని, డీఈవోగా నవిత, ఎంఈఓగా అరవింద్, ప్రిన్సిపాల్‌గా ఎల్లప్ప, వైస్ ప్రిన్సిపాల్‌గా శిరీష వ్యవహరించారు. పలువురు విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్ర పోషించి చక్కగా విద్యాబోధన చేశారు. పాఠశాల కరస్పాండెంట్ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని తెలిపారు. అనంతరం చక్కటి విద్యాబోధన చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేష్, ఉపాధ్యాయులు నమ్రత, విజయ, అమల, షమీనా, సౌజన్య పాల్గొన్నారు.

## ఉద్యమకారులపై నమోదైన కేసు కొట్టివేత

**ముద్ర, నారాయణపేట :**

నారాయణపేటను నూతన జిల్లాగా ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో అప్పట్లో పెద్దఎత్తున ఉద్యమం కొనసాగింది. 2016లో నారాయణపేట పట్టణంలోని పర్మరెడ్డి కాలనీలో ఉన్న ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి క్యాంపు కార్యాలయంపై జిల్లా ఏర్పాటు ఉద్యమం నేపథ్యంలో దాడి చేశారని ఆరోపిస్తూ కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పనిచేసే ఆఫీస్ బాయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుమారు 12 మంది వ్యక్తులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసులో 2017 మార్చి 15న చార్జ్ షీట్ దాఖలు చేశారు. ఇందులో ఏ1గా మాజీ కౌన్సిలర్ వినోద్, ఏ2గా కొండా సత్య యాదవ్, ఏ3గా వెంకటేష్ గౌడ్‌తోపాటు మరికొంతమందిపై 147, 148, 452, 324, 353, 427 r/w 149 సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఈ కేసు విచారణ గురువారం నారాయణపేట కోర్టులో బెంచ్‌పైకి రాగా, కేసుకు సంబంధించిన సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో కేసును కొట్టివేసినట్లు న్యాయవాది ప్రవీణ్ నామాజీ తెలిపారు.

## గోస్పెల్ గ్లోబల్ మినిస్ట్రీస్ 36వ వార్షికోత్సవం

**ముద్ర కూకట్‌పల్లి :**

గోస్పెల్ గ్లోబల్ మినిస్ట్రీస్ 36వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని, తెలంగాణ ప్రభుత్వ మైనార్టీ సంక్షేమ శాఖ సహకారంతో క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షల సమావేశం గురువారం ఘనంగా నిర్వహించారు. బిషప్ ఆర్.ఎ. పాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో ఐక్యత, శాంతి మరియు సోదరభావాన్ని పెంపొందించడానికి ఇలాంటి ఆధ్యాత్మిక సమావేశాలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాలి బాలాజీ, పుష్ప రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, గంధం రాజు, దినేష్ కుమార్, శివ చౌదరి, సుజాత, వాణి, శైలజ, శ్రీకాంత్ పటేల్, పులి శివ గౌడ్, నాయుడు, మదన్ మోహన్, ప్రశాంత్, పెద్ద సంఖ్యలో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధులు బాధ్యతతో పని చేయాలి

- **సంక్షేమ పథకాల్లో మహిళలకు పెద్దపీట**
- **రూ.5 వేల కోట్లతో మక్తల్-నారాయణపేట- కొడంగల్ ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభం**
- **ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై ప్రజా ప్రతినిధులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి**



**ముద్ర, నారాయణపేట :**

ప్రజా ప్రతినిధులు పారదర్శకంగా, బాధ్యతతో పని చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై ప్రజా ప్రతినిధులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సర్పంచ్ పదవి ఎంతో కీలకమైందని తెలిపారు. బాపూజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం కోసం మనందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్ అమల్లో భాగంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి 272 మంది సర్పంచులు, 72 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. వారిని ఉద్దేశించి మంత్రి దిశానిర్దేశం చేశారు. సర్పంచ్ పదవి అంటే ఆషామాషీ కాదని, మున్సిపల్ చైర్మన్ పదవి కూడా ఎంతో కీలకమని తెలిపారు. పుట్టిన, మరణ ధ్రువీకరణ పత్రాలు అందజేసే సర్పంచ్, చైర్మన్ పదవులు ఎంతో ముఖ్యమని తెలిపారు. మనము పుట్టిన ప్రాంతానికి సేవ చేసే అవకాశం దొరకడం గొప్ప అదృష్టమని సర్పంచ్‌లకు హితోపదేశం చేశారు. తాను సర్పంచ్ నుంచి మంత్రి స్థాయికి ఎదిగానని చెప్పారు. మన గ్రామాలను అభివృద్ధి చేసి పది తరాల వరకు గుర్తుండిపోయేలా చైర్మన్‌లు, సర్పంచ్‌లు పనిచేయాలని సూచించారు. గ్రామాలకు ఏ అవసరం ఉన్నా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. రూ.5 వేల కోట్లతో మక్తల్‌నారాయణపేటకొడంగల్ ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఎకరానికి రూ. 20లక్షలు ఇచ్చి భూ నిర్వాసితులను ఈ ప్రభుత్వం ఆదుకున్నదని మంత్రి వెల్లడించారు. వరికి మద్దతు ధరతో పాటు బోనస్ ఇచ్చి, పండించిన పంటను సన్నబియ్యంగా మార్చి రేషన్ షాపుల ద్వారా పేదలకు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. సంక్షేమ పథకాల్లో ప్రజా ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. కోటి మంది మహిళలను కోటేశ్వరులను చేయడమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. రూ.25 కోట్ల రూపాయలతో స్టేడియం నిర్మాణం కోసం మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) ఫణిందర్ రెడ్డి, ఎస్పీ డాక్టర్ వినీత్, అదనపు కలెక్టర్ శ్రీను, జిల్లాలోని మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సర్పంచ్లు, కౌన్సిలర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి ప్రణాళికలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

- **కలెక్టర్ సి నారాయణ రెడ్డి**




**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజులపాటు దిగ్విజయం చేసేందుకు ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ సి నారాయణ రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కాచారం గ్రామంలోని వర్ధమాన ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సర్పంచ్‌లకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ సి నారాయణ రెడ్డి చేవెళ్ళ శాసన సభ్యులు కాలే యాదయ్యతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తగా సర్పంచులు గా ఎన్నికైన అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన మీరంతా మీ సమయాన్ని వృథా చేయకుండా గ్రామాభివృద్ధికి సమయాన్ని వెచ్చించాలని గ్రామాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అమలు చేసేలా ఎక్కడ ఎలాంటి వైరుధ్యాలు లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేస్తేనే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. 99 రోజుల పాటు పది అంశాలతో నిర్వహిస్తున్న కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 2న గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించి ఇందులో ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే మాస్టర్ ట్రైనర్స్, అధికారులు నివృతి చేస్తారన్నారు.

**- ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలి : చేవెళ్ల ఎమ్మెల్యే**

చేవెళ్ళ శాసన సభ్యులు కాలే యాదయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించి వారిని పథకాల అమలులో భాగస్వాములను చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందజేసేందుకు తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు.

**- సర్పంచులకు ఐడి కార్డుల అందజేత**

సమావేశంలో కొత్తగా ఎన్నికైన సర్పంచులకు ఐడి కార్డులను, 99 రోజుల ప్రణాళిక బుక్స్ అందజేశారు. అనంతరం 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలోని 10 ప్రధాన అంశాలను సంబంధిత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, జిల్లా అధికారులు, మండలాల అధికారులు, సర్పంచులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి

**- ఆరుగురు అరెస్ట్.. రూ.2.8 లక్షలు స్వాధీనం**

**ముద్ర, కూకట్‌పల్లి :**

కేపీహెచ్‌బీ కాలనీలోని భగత్ సింగ్ నగర్‌లో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేయడంతో పాటు భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రాత్రి భగత్ సింగ్ నగర్ 6వ ఫేజ్‌లోని ఒక ఇంట్లో కొందరు వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు పణంగా పెట్టి పేకాట ఆడుతున్నట్లు కేపీహెచ్‌బీ ఎస్ఐ శ్రీనివాస్‌కు నమ్మదగిన సమాచారం అందింది. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం అందించిన పోలీసులు ఇద్దరు సాక్షులతో కలిసి రాత్రి 8.30 గంటల సమయంలో సదరు నివాసంపై దాడి చేశారు. పోలీసుల తనిఖీల్లో ఆరుగురు వ్యక్తులు సర్కిల్‌గా కూర్చుని పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. పట్టుబడ్డ వారిని విచారించగా వారంతా ఫోన్ల ద్వారా సంప్రదించుకుని ఒకేచోట చేరి జూదం ఆడుతున్నట్లు అంగీకరించారు.
వీరి నుంచి రూ. 2 లక్షల 80వేల 330 నగదు, ఆరు మొబైల్ ఫోన్లు, 20 సెట్ల పేకాట ముక్కలు, 80 పోకర్ చిప్స్ స్వాధీనం చేసుకొని నిందితులను పోలీసులు రిమాండ్ కు తరలించారు.

## ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

- **మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి**




**ముద్ర, మేడ్చల్ జిల్లా ప్రతినిధి :**

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందించేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు. గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై నూతన మున్సిపల్ చైర్ పర్సన్లు కౌన్సిలర్లు, అధికారులకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఒక రోజు అవగాహన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఫైజాన్ అహ్మద్, అదనపు కలెక్టర్ రెవిన్యూ విజయేందర్ రెడ్డి, డి ఆర్ ఓ చంద్రవతి, ట్రాఫిక్ ఏ సి పి వెంకట్ రెడ్డి, జిల్లా మార్కెంటింగ్ చైర్మన్ నిర్సింహయాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టిఎ కమీషన్ సభ్యులు జైపాల్ రెడ్డి లు పాల్గొన్నారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 6 నుండి ప్రారంభమైనఈ కార్యక్రమం జూన్ 12 వరకు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతుందని తెలిపారు. 99 రోజుల కార్యక్రమంలో 5 స్థాయిలలో గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి కార్యక్రమాలలో 10 థీమ్స్ గురించి కలెక్టర్ వివరించారు. కీలకమైన ప్రజా సంక్షేమ పథకాల అమలు విషయంలో ఎంపిక, అర్హతలు పరిశీలించి అధికారులు క్లుప్తంగా వివరించాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజులపాటు దిగ్విజయం చేసేందుకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేస్తేనే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై రూపొందించిన పాటలతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, నూతనంగా ఎన్నికైన చైర్మన్లు, వార్డు మెంబర్లు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి చట్టంతో రైతులకు శాశ్వత పరిష్కారం

- **ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**



**ముద్ర, తాండూర్ :**

భూభారతి చట్టం ద్వారా రైతులకు శాశ్వత పరిష్కారం లభించనుందని తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తెలిపారు. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం గిర్మాపూర్ గ్రామంలో నిర్వహించిన భూభారతి సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. సర్వే జరుగుతున్న రైతు రామిరెడ్డి పొలాన్ని సందర్శించి రైతులతో పాటు సర్వేయర్లతో నేరుగా మాట్లాడి సర్వే సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ధరణి స్థానంలో భూభారతి వ్యవస్థను తీసుకొచ్చామని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో పాలకుల నిర్లక్ష్యం వల్ల రెవెన్యూ వ్యవస్థ సర్వనాశనం అయిందని, ఇచ్చిన మాట ప్రకారం ప్రజలకు సమగ్రమైన పాలన అందించాలనే ఉద్దేశంతో ధరణి స్థానంలో భూభారతి వ్యవస్థను తీసుకొచ్చామని చెప్పారు. రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే ఉద్దేశంతో అధికారులు నేరుగా గ్రామాలకు వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారని వివరించారు. పట్టా సర్వే నంబర్ స్థానంలో భూదాన్ నంబర్‌ను ప్రవేశపెడుతున్నామని తెలిపారు. సర్వేలో భాగంగా పట్టా భూమి, గ్రామకంఠం, భూదాన్, ప్రభుత్వ భూమి ఏది అనేది స్పష్టంగా వేరుచేసి గుర్తించడం జరుగుతుందని పేర్కొన్నారు. భూభారతి చట్టం ద్వారా పారదర్శకమైన, సుస్థిరమైన భూ రికార్డు వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివరాం నాయక్, పార్టీ సీనియర్ నాయకులు అంజయ్య, లొంక నర్సింలు, పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఎర్ర పోచమ్మ తల్లి దేవస్థాన వార్షికోత్సవం



**ముద్ర, కూకట్‌పల్లి :**

వెస్ట్ సాయి నగర్ కాలనీలోని శ్రీ ఎర్ర పోచమ్మ తల్లి దేవస్థాన తృతీయ వార్షికోత్సవ వేడుకలు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. రాజేశ్వరరావు ఆలయానికి చేరుకోగానే కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.
ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో వడ్డేపల్లి రాజేశ్వరరావుతో పాటు బీజేపీ నాయకులు రామరాజు, నర్సింగ్, స్థానిక కాలనీ వాసులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలతో కాలనీ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా నేతలు ఆకాంక్షించారు.


**ఐపీఎల్ అత్యధిక వ్యక్తిగత స్కోరు**



ఐపీఎల్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు 175. ఇది Chris Gayle 2013లో సాధించాడు.

# కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం

**- మంత్రి పొన్నం ప్రభాకర్**



**ముద్ర, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్ లోని గాంధీ భవన్ లో పీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ గా మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కవ్వం పల్లి సత్యనారాయణ కు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నెహ్రు నుంచి రాహుల్ గాంధీ వరకు సామాజిక న్యాయం అమలు చేస్తోందని తెలిపారు. కవ్వం పల్లి సత్యనారాయణ సారథ్యంలో ఎస్సీల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి విద్య ముఖ్యమని గుర్తించాలన్నారు. దేశ ఐక్యతకు పాటు పడేది కేవలం కాంగ్రెస్ మాత్రమేనని తేల్చి చెప్పారు. ఎస్సీల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వివేక్ వెంకట్ స్వామి, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, లక్ష్మీ కాంత్, యెన్నం శ్రీనివాస్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, మాజీ ఎమ్మెల్యే మోత్కుపల్లి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తాం

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, ధర్మపురి:** గ్రామీణ ప్రజలకు వైద్య సేవలదిస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. గురువారం ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ను ఆశా వర్కర్లు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని, ఇందులో భాగంగా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ప్రతీ ఒక్కరు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి పేర్కొన్నారు.

## పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



**ముద్ర, జగిత్యాల:** పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జగిత్యాల జిల్లాలోని కోరుట్ల పట్టణంలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా శ్మశానవాటిక, డంపింగ్ యార్డ్, పారిశుధ్య పనుల నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత కల్పించాలని తెలిపారు. చెత్తను సమయానికి సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చెత్త సేకరణ వ్యవస్థను సమర్థంగా అమలు చేయాలన్నారు. చెత్తను శాస్త్రీయ పద్ధతిలో సేకరిస్తూ పరిసర ప్రాంతాల్లో దుర్వాసన, కాలుష్యం లేకుండా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

# 'ప్రజా పాలన' తో ప్రగతి సాధిద్దాం

**- కలెక్టర్ అభిలాష అభినవ్**




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికను అమలుచేసి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రగతిని సాధిద్దామని కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో ఇటీవల ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పవార్ రామారావు పటేల్, వెడ్మ బొజ్జు పటేల్ లతో కలిసి కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలు, కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరాలనే ఉద్దేశంతో 99 రోజుల ప్రత్యేక ప్రణాళిక ప్రారంభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రత్యేక ప్రణాళికలో భాగంగా జిల్లాలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజల్లో ఉన్న అనారోగ్య సమస్యలను తీర్చేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజా ప్రతినిధులందరికి పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలపై అవగాహన ఉండాలని తెలిపారు. ప్రజా ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులుగా ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం గొప్ప విషయమన్నారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, నిర్మల్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ లు అప్పాల కావ్య, అప్పాల గణేష్ చక్రవర్తి, భైంసా మున్సిపల్ చైర్మన్ మున్సిపల్ దత్తాత్రి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ, డీఎల్ఎస్ఏ సెక్రెటరీ రాధిక, సర్పంచ్ లు, కౌన్సిలర్ లు, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ మేయర్ కు సన్మానం



**ముద్ర, కరీంనగర్:** బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియామకమైన కరీంనగర్ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ను గురువారం నగరంలోని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ క్యాంపు కార్యాలయంలో పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. బీజేపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కరీంనగర్ జిల్లా ఇంచార్జి శాంతకుమార్, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు మనోహార్ రెడ్డి, పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జి బోయినపల్లి ప్రవీణ్ రావు సన్మానించి అభినందనలు తెలిపారు.

## ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు



**మహాదేవపూర్, ముద్ర:** జిల్లా కేంద్రంలో గురువారం సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో డీపీఆర్ఓ శీలం శ్రీనివాసరావు ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి బింబించేలా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ప్రజా ప్రతినిధులు వీక్షించారు.

## పదో తరగతి కీలకం



**ముద్ర, ఆదిలాబాద్:** విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి కీలకమని ఆదిలాబాద్ ఎంఈవో సోమయ్య సూచించారు. జిల్లా ఆర్య వైశ్య మహాసభ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పెన్నుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అంతకు ముందు వాసవీమాత సన్నిధిలో పెన్నులకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల భయాన్ని వీడి సన్నద్ధం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లాలో వంట గ్యాస్ కొరత లేదు

**- కలెక్టర్ రాహుల్ శర్మ**



**మహదేవపూర్, ముద్ర:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వంట గ్యాస్ కొరత లేదని కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ సరఫరా పరిస్థితులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ పంపిణీలో అంతరాయం కలిగే పరిస్థితులు లేదా అక్రమాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వినియోగదారుల హక్కులను పరిరక్షించడం, పారదర్శకంగా సేవలు అందించడం ప్రతి గ్యాస్ ఏజెన్సీ బాధ్యత అని తెలిపారు. ప్రజలు గ్యాస్ కొరతపై వస్తున్న అపోహలను నమ్మకూడదని సూచించారు. జిల్లాలో గ్యాస్ నిల్వలు, సరఫరా పూర్తిగా సమృద్ధిగా ఉన్నాయని పేర్కొన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఏఎస్పీ నరేష్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమా ర్, పౌర సరఫరాల సంస్థ డీఎం రాములు, ఎల్పీజీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు

**మీడియా ప్రతినిధులకు పరామర్శ..**

జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కన్వెన్షన్ హాల్‌లో ప్రభుత్వ పథకాలపై ఏర్పాటు చేసిన సమావేశం వార్త సేకరణకు వెళ్లిన మీడియా ప్రతినిధులు లిఫ్ట్ వైర్ తెగటంతో జరిగిన ప్రమాదంలో గాయపడ్డారు. ప్రమాద ఘటన తెలుసుకున్న కలెక్టర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న మీడియా ప్రతినిధులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని, ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి అవసరమైన సేవలు అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి , ఆర్ఎంఓ దివ్య ఉన్నారు.

## స్థానిక సంస్థలు ఆదాయం పెంచుకోవాలి



**మహదేవపూర్, ముద్ర:** పంచాయతీలు, మున్సిపాలిటీలు ఆదాయ మార్గాలను పెంచుకుని గ్రామాలను, పట్టణాలను అభివృద్ధి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీనివాస ఫంక్షన్ హాలులో సర్పంచులు, కౌన్సిలర్లుకు 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. 99 రోజుల ప్రణాళికలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పంచాయతిలు, మున్సిపాలిటీ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి గ్రామాలు, పట్టణాలను పరిశుభ్రంగా తయారు చేయాలని తెలిపారు. ప్రజలను ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని, శిక్షణను ఆచరణలో పెట్టాలని ప్రజాప్రతినిధులను కోరారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. గ్రామాలు, మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి జాబితా తయారు చేసి ప్రజలకు తెలియ చేయాలన్నారు. గ్రామాలు, పట్టణంలో సర్పంచు లు, చైర్మన్లు ఈ కార్యక్రమాన్ని ఉద్యమంలాగ చేపట్టాలన్నారు. అన్ని గ్రామాల సర్పంచులకు, మున్సిపల్ చైర్మన్ కు 99 రోజుల కార్యక్రమం షెడ్యూల్ ను అమలు చేయాలని కోరారు. అనంతరం పంచాయతి, మున్సిపల్, వైద్య, పోలీస్, రవాణా, సంక్షేమ శాఖల అధికారులు, వ్యవసాయ, ఎక్సైజ్, విద్యా, యువజన సర్వీసులు క్రీడల శాఖ, అటవీ శాఖల అధికారులు ఆయా శాఖల ద్వారా చేపట్టనున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి , ఆర్డీఓ హరికృష్ణ, ఎఎస్పీ నరేష్ కుమార్, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, అన్ని శాఖల జిల్లా అధికారులు, కౌన్సిలర్లు, సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు

**ముద్ర, కరీంనగర్:** ఫిబ్రవరి 25న ప్రారంభమైన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఏడాది పాటు చదివి పరీక్షలు రాసిన విద్యార్థులు.. ఉత్తమ ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు సంతోషంతో పరీక్ష కేంద్రాల వద్ద సందడి చేశారు. స్నేహితులతో పరీక్షలు రాసిన తీరును పంచుకున్నారు. కేంద్రాల వద్ద కేరింతలతో స్నేహితులకు వీడ్కోలు పలికారు. ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ హాస్టళ్లలోని విద్యార్థులు ఇంటి బాట పట్టారు.

# మహదేవపూర్ లో ఈద్ కా తోపా పంపిణీ




**మహదేవపూర్, ముద్ర:** రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఈద్ కా తోపాను సద్విని యోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు సూచించారు. గురువారం మండల కేంద్రంలో సర్పంచ్ హసీనా భాను ఆధ్వర్యంలో నిర్వహించిన ఈద్ కా తోపా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సర్పంచ్ హసీనా భాను మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ పండుగను పురస్కరించుకొని నిరుపేద ముస్లిం మహిళలు ఆనందంగా పండుగను జరుపుకోవాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు ఈదుకా తోఫా రూపొందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మం డల అధ్యక్షుడు అక్బర్ ఖాన్, గ్రామంలోని మూడు మసీదుల సదర్‌లు తాజోద్దీన్, ముజ్జు ఖాన్, మాజీ మజీద్ కమిటీ సదర్ గయాజ్ ఖాన్, స్థానిక నాయకులు వామన్ రావు, ఉప సర్పంచ్ శ్రీజ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

శుక్రవారం 13-03-2026
www.mudranews.in | @mudranews



### ఐపీఎల్ అత్యధిక పరుగులు



ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడు విరాట్ కోహ్లి. అతను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్ తరఫున ఆడుతున్నాడు.

## వస్త్ర దుకాణాల్లో రూ.15 వేల హుక్కా పట్టివేత

ముద్ర, సూర్యాపేట:

విశ్వసనీయ సమాచారం మేరకు సూర్యాపేట పట్టణం మెయిన్ రోడ్ నందు గల ఆర్.వి ఫ్యాషన్స్, ఎక్స్ట్రీమ్ ఫ్యాషన్స్ వస్త్ర దుకాణాల్లో పట్టణ పోలీసులు తనిఖీలు నిర్వహించి రూ.15వేల విలువైన హుక్కా ప్యాకెట్లు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ ఈ ఘటనకు సంబంధించి ముగ్గిరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యాలను హరించే ఇలాంటి వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పి హెచ్చరించారు, హుక్కా వల్ల ఆరోగ్యాలు నాశనం అవుతాయని, యువత ఇలాంటి చెడు అలవాట్లకు లోనుకావొద్దని సూచించారు.

## కేసీఆర్, కేటీఆర్, హరీష్ లను కలిసిన బొక్క జైపాల్ రెడ్డి

ముద్ర, బీబీనగర్:

బీబీనగర్ మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు బొక్క జైపాల్ రెడ్డి గురువారం భారత రాష్ట్ర సమితికి చెందిన పలువురు అగ్రనేతలను కలుసుకున్నారు. తొలుత ఎర్రవెల్లి ఫామ్ హౌస్ లో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభివాదం చేసి, ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం హైదరాబాద్ లో పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను, మాజీ మంత్రి హరీష్ రావును కలిశారు. ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటు బీఆర్ఎస్ నాయకుడు నంద్యాల దయాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు,

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- ముద్ర ప్రతినిధి, భువనగిరి :

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా గురువారం 10, 25, 32 వార్డులలో పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మున్సిపల్ జి. రామలింగం, కౌన్సిలర్లు బింగి నరేష్, బెండె స్వరూప లాల్ రాజు, బర్రె సంఘవి కరుణాకర్, పాల్త్య వెంకటేష్ జంగిటి వినోద్ కుమార్, బొంతల నర్సింగ్ రావు, తుమ్మేటి పాండు, జాలిగం విగ్నేశ్, సుదగాని సరిత రాజు, సరగడ రాజ్యలక్ష్మి అమర్ మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మేకలను ఎత్తుకెళ్లిన దొంగలు

ముద్ర, మోత్కూర్:

మోత్కూర్ మున్సిపల్ పరిధిలోని కొండగడప గ్రామానికి చెందిన దొండ లింగమల్లు యాదవుకు 13 మేకలు ఉన్నాయి. మేకలను మేతకు తన ఇంటి పక్కనే ఉన్న దొడ్డిలో ఉంచుతాడు. బుధవారం రాత్రి ఐదు మేకలు దొంగతనానకి గురయ్యాయని దొండ లింగంపల్లి యాదవ్ తెలిపారు. దొంగలించిన మేకల విలువ సుమారు 50 వేల రూపాయలు ఉంటుందని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. స్థానిక సిఐ వెంకటేశ్వర్లు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పాఠశాలను తనిఖీ చేసిన ప్యానల్ ఇన్స్పెక్షన్ బృందం

ముద్ర, మోత్కూర్:

ప్యానెల్ ఇన్స్పెక్షన్ బృందం గురువారం మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్, పద్మశాలి కాలనీ, కాశవారి గూడెం, ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసింది. ఈ సందర్భంగా నోడల్ బృంద సభ్యులు వనం వెంకటేశ్వర్లు సత్తిరెడ్డి మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠశాలల పనితీరుపై ప్యానల్ ఇన్స్పెక్షన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు వనం వెంకటేశ్వర్లు, సత్తిరెడ్డి, పాఠశాల హెడ్మాస్టర్లు , పుష్పలత, పరమేశ్వరి, నర్సయ్య, సుధా కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో జిల్లాను ముందుంచాలి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

ముద్ర ప్రతినిధి, భువనగిరి:



ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన చేసుకొని అర్హులైన ప్రతి ఒక్క రికి సంక్షేమ ఫలాలు గ్రామాలలో, వార్డులలో అందించి జిల్లాను అభివృద్ధిలో ముందు ఉంచాల్సిన బాధ్యత సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, చైర్ పర్సన్ లపై ఉందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా భువనగిరి పట్టణంలోని వి–కన్వెన్షన్, న్యూ వివేరా లో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు, సర్పంచులకు, చైర్ పర్సన్ లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి పేదవారికి అమలు చేసేలా చూడాలన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకొని గ్రామాలను అందంగా తీర్చిదిద్దే విధంగా పనులు చేపట్టాలన్నారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) మాట్లాడుతూ ప్రజలు మెచ్చేలా అభివృద్ధి పనులు గ్రామాలలో, పట్టణాలలో చేపట్టాలన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఏ సమస్య ఉందో తెలుసుకుని వారికి అవసరమైన సాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, ఇతర అభివృద్ధి పనులను గ్రామాలలో చేపట్టాలన్నారు.

పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యం, పరిశుభ్రత పాటించినట్లయితే గ్రామాలు అందంగా తీర్చిదిద్దబడతాయన్నారు.

సెర్ప్ సిఈఓ, పంచాయతీ రాజ్ కమీషనర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ ప్రతి మండలంలో ప్రజా పాలన వచ్చినప్పటి నుండి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మా ట్లాడుతూ జిల్లాలో ప్రమాదాల నివారణకు, మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేం దుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, గ్రామా లలో పట్టణాలలో రాష్ డ్రైవింగ్, వేరే హెల్మెట్, నో డ్రగ్స్ తదితర అంశాల గురించి ప్రజలకు, ముఖ్యంగా యువతకు, ఎదుగుతున్న పిల్లలకు విధిగా అవగాహన కల్పించాలన్నారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, జడ్పీ సీఈవో శోభారాణి, జిల్లాలోని అన్ని మండలాల చైర్మన్లు, వార్డు మెంబర్లు, సర్పంచులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### కర్ల రాజేష్ విషయంలో

# ప్రభుత్వం సమాధానం చెప్పాలి

- 14న సీఎం హుజూర్ నగర్ పర్యటన అడ్డుకుంటాం
- మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్

ముద్ర ప్రతినిధి, కోదాడ:



కర్ల రాజేష్ విషయంలో ప్రభుత్వం సమాధానం చెప్పాలని లేకుంటే ఈ నెల 14న హుజూర్నగర్‌లో సీఎం కాన్వాయ్‌ను అడ్డుకుంటాంమని మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ అన్నారు. సీఎం హుజూర్ నగర్ పర్యటనకు రావడానికి ముందు మా ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా హుజూర్ నగర్ నియోజకవర్గంలో అడుగు పెట్టవద్దని ముందుగానే హెచ్చరిస్తున్నాం అని అన్నారు. మా కోదాడ ప్రాంతానికి చెందిన దళిత బిడ్డ కర్ల రాజేష్‌ను చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో పోలీసులు హింసించి చంపిన ఘటన జరిగి నాలుగు నెలలు గడిచాయన్నారు. ఈ దారుణానికి కారణమైన అధికారులను కేవలం సస్పెన్షన్లతో, ప్రమోషన్లతో కాపాడటం, దేనికి సంకేతం అని ఆయన ప్రశించారు . వారిని వెంటనే సర్వీస్ నుండి తొలగించి, హత్య కేసులు నమోదు చేసి జైలుకు పంపడంలో ప్రభుత్వం ఎందుకు వెనుకడుగు వేస్తోందన్నారు. వ్యక్తిగత రాజకీయ కక్షతో ఈ దళిత బిడ్డను హత్య చేశారని అన్నారు. నాలుగు నెలలుగా బాధిత కుటుంబం రోడ్లపై న్యాయం కోసం తిరుగుతుంటే, కనీసం పరామర్శించడానికి కూడా సీఎంకు గానీ, ఉత్తమ్ దంపతులకు గానీ సమయం దొరక లేదా అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, బాధ్యులైన అధికారులను, ఈ ఘటనలో ప్రమేయం ఉన్న వారిని వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపకుండా హుజూర్ నగర్‌కు రావాలని ప్రయత్నిస్తే సీఎం పర్యటనను అడ్డుకుంటామని అన్నారు.

### బస్వాపురం ప్రాజెక్టు

# నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ్మా

ముద్ర ప్రతినిధి, భువనగిరి :

బస్వాపురం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు, ఇండ్లు కోల్పోతున్న ప్రజలకు పూర్తిస్థాయి నష్టపరిహారం వెంటనే చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రాత్రి భువనగిరి మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో సిపిఎం శాఖ సమావేశం నరాల చంద్రయ్య అధ్యక్షతన జరగగా ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నర్సింహ పాల్గొని మాట్లాడారు. తమ భూములను, వందలాది సంవత్సరాలుగా ఒక గ్రామంలో గూడును ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న ప్రజలు ఇతరుల అవసరాల కోసం, సాగునీరు కోసం సర్వం కోల్పోతూ ప్రాజెక్టు నిర్మాణానికి సర్వము అర్పించిన నేటికీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇవ్వకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు అన్నంపట్ల కృష్ణ, మండల కమిటీ సభ్యులు మధ్యపురం బాల్ నరసింహ, శాఖ కార్యదర్శి మచ్చ భాస్కర్, సహాయ కార్యదర్శి రాసాల దేవేందర్, సభ్యులు ఉడుత విష్ణు, ఎండి. బాబు, ఉడత వెంకటేష్, ముదిగొండ కృష్ణ పాల్గొన్నారు.



### భూసారం కాపాడేందుకు

# శాస్త్రీయ పద్ధతులు అవలంబించాలి

- జిల్లా ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ నివేదిత
- రైతులకు ఆధునిక వ్యవసాయంపై శిక్షణ

ముద్ర ప్రతినిధి, కోదాడ:



భూసారం కాపాడేందుకు రైతులు శాస్త్రీయ పద్ధతులు అవలంబించాలని జిల్లా ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ నివేదిత తెలిపారు. కోదాడ మండలంలోని అల్వాలపురం రైతు వేదికలో డివిజన్, మండల స్థాయి వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పథకం ఆధ్వర్యంలో రికగ్నిషన్ ఆఫ్ ప్రియర్ లెర్నింగ్ (ఆర్.పి.ఎల్) శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువులను అధికంగా వినియోగించడం వల్ల భూసారం క్షీణిస్తుందని తెలిపారు. రైతులు శాస్త్రవేత్తలు సూచించిన విధంగా దఫాల వారీగా ఎరువులు వినియోగించాలని సూచించారు. భూమిలో సేంద్రియ కర్బనం పెంచేందుకు ప్రధాన పంటల సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువులను సాగు చేసి కలియ దున్నడం ద్వారా భూసారం మెరుగుపడుతుందని వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి శాస్త్రవేత మాట్లాడుతూ యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, నానో డి.ఏ.పీ ఎరువులను వినియోగించడం ద్వారా మొక్కలకు అవసరమైన నత్రజని నేరుగా పత్రాల ద్వారా అందుతుందని తెలిపారు. దీని వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గడమే కాకుండా భూమిలో నత్రజని నష్టం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. వరి పంటలో ప్రాచుర్యంలో ఉన్న రకాల గురించి, తెగుళ్లు పురుగుల గురించి వివరించారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించి రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు వరి పంటలో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. మండల వ్యవసాయ అధికారి పాలెం రజని వ్యవసాయశాఖ అమలు చేస్తున్న పథకాలపై రైతులకు వివరించారు. పశు సంవర్ధక శాఖ డాక్టర్ మాట్లాడుతూ పశుగ్రాసం పెంపకం, పాడి పశువుల అభివృద్ధి పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కోదాడ నియోజకవర్గ ఆత్మ చైర్మన్ బుడిగం లింగయ్య, ఆత్మ డైరెక్టర్లు, కోదాడ సాంకేతిక వ్యవసాయ అధికారి దేవప్రసాద్, కోరమండల్ సంస్థ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు నగేశ్, ఝాన్సీ, వినోద్, అన్వేష్, సల్మా, రైతులు పాల్గొన్నారు.

### మహిళల సమస్యలపై

# ఉద్యమాలకు సిద్ధం కావాలి

ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ



ముద్ర ప్రతినిధి, భువనగిరి:

మహిళల సమస్యల పరిష్కారానికి మహిళలు ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ పిలుపునిచ్చారు. గురువారం భువనగిరి మండలం ముత్తిరెడ్డి గ్రామంలో ఐద్వా గ్రామ మహాసభ కొండ హైమావతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలన్నారు. ఐద్వా మండల కార్యదర్శి కొండమడుగు నాగమణి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం నిత్యవసర వస్తువుల ధరలను పెంచుతూ పోవడం వల్ల పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అనంతరం నూతన ఐద్వా గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా ఎడ్ల జ్యోతి, కార్యదర్శిగా కొండ హైమావతి, కోశాధికారిగా కొండమడుగు కావ్య, ఉపాధ్యక్షురాలుగా కొండమడుగు లక్ష్మి, పిన్నింటి హేమలత, సహాయ కార్యదర్శులుగా మెరుగు మహేశ్వరి, బొల్లెపల్లి భాను కమిటీ సభ్యులుగా ఎడ్ల రామలీల, కొండ సుజాత, ఆకారం తులసమ్మ, కొండమడుగు మమత, కొండ మంగమ్మ, బొజ్జ లక్ష్మి, బబ్బురి ఉపేంద్ర, మెరుగు సుశీల, బొజ్జ అలివేలు ఎన్నికయ్యారు.

# రంజాన్ తోఫా పంపిణీ చేసిన ఎమ్మెల్యే 'కుంభం'

ముద్ర ప్రతినిధి, భువనగిరి:





భువనగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముస్లింలకు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గురువారం రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పర్వదినం శాంతి, సోదరభావం, సేవా భావానికి ప్రతీక అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తీ, మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, భువనగిరి తహసీల్దార్ జగన్, కాంగ్రెస్ నాయకులు తంగళ్లపల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి తాపీమేస్త్రి వల్లెపు శ్రీనివాస్ అండ

- తన సొంత ఖర్చులతో పేదింటి బిడ్డకు పెళ్లి చేసిన తాపీమేస్త్రి

ముద్ర, నడిగూడెం:



ఓ పేదింటి బిడ్డకు తాపీమేస్త్రి పెళ్లి చేశాడు. సూర్యాపేట జిల్లా, హుజూర్నగర్ మండలం, వేపల సింగారం గ్రామానికి చెందిన వేముల వీరబాబు–సునీత దంపతులు బ్రతుకుదెరువు కోసం నడిగూడెం వచ్చి జీవనం సాగిస్తున్నారు. కుటుంబ పరిస్థితులు చాలా క్లిష్టంగా ఉండటంతో పాటు వారికి ముగ్గురు కుమార్తెలు ఉండటంతో కుటుంబ పోషణ కూడా చాలా కష్టంగా మారింది.

ఈ పరిస్థితుల్లో పెద్ద కుమార్తె నాగలక్ష్మి వివాహం చేయడం వారికి భారంగా మారింది. దిక్కు తోచని స్థితిలో ఉన్న కుటుంబానికి తాపీమేస్త్రి శ్రీనివాస్ అండగా నిలిచి వివాహ ఖర్చులు భరించాడు. వివాహానికి సుమారు రూ70,000 ఖర్చు చేసి తన ఉదారతను చాటుకున్నారు. నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన వల్లెపు శ్రీనివాస్ ను సిఐటియు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ, గ్రామ ప్రజలు ప్రశంసిస్తున్నారు. తన కుమార్తెకు వివాహం జరిపించిన వల్లెప్ శ్రీనుకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్య విరుద్ధం


- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

ముద్ర మోత్కూర్:

బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు 10 మంది పార్టీ పీరాయించలేదని స్పీకర్ తీర్పు ఇవ్వడం ప్రజాస్వామ్య విరుద్ధమని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్పీకర్ నిర్ణయాన్ని ప్రజలు తప్పు పడుతున్నారనీ, దానం నాగేందర్ ఎంపీగా. కడియం శ్రీహరి కూతురు పోటీ ఎంపీగా పోటీ చేయించి ప్రచార చేసింది ఎవరని ఆయన ప్రశ్నించారు.

స్పీకర్ పదవికి ఆయన అనర్హుడు కాబట్టి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన అన్నారు.

### ఐపీఎల్ అత్యధిక వికెట్లు




ఐపీఎల్‌లో ఎక్కువ వికెట్లు తీసిన బౌలర్ Yuzvendra Chahal. అతను వివిధ జట్ల తరపున కీలకంగా నిలిచాడు.



## కార్పొరేట్ సంస్థల పాత్ర ప్రశంసనీయం

- మంత్రి దామోదర రాజనర్సింహ

**ముద్ర, సంగారెడ్డి:**

కార్పొరేట్ సంస్థలు తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమాల ద్వారా సమాజ అభివృద్ధికి తోడ్పడటం అభినందనీయమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. తోషిబా ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తమ సి ఎస్ ఆర్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించేందుకు అందజేసిన రెండు బస్సులను గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి ప్రారంభించారు. అనంతరం సంగారెడ్డి ప్రభుత్వ నర్సింగ్ కళాశాల మరియు జోగిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలకు చెందిన ప్రిన్సిపాల్‌కు ఆ బస్సులను కంపెనీ డైరెక్టర్ మారుమోటో చేతుల మీదుగా మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నర్సింగ్ విద్యార్థుల రవాణా సౌకర్యార్థం అందజేసిన ఈ బస్సుల ద్వారా వారికి ఎంతో సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఇటువంటి సహకారం అందించడం ద్వారా సంస్థ సమాజం పట్ల తన బాధ్యతను చాటుకుందని ఆయన అభినందించారు. అదేవిధంగా బిడెకన్నె మహిళా సంఘం సభ్యులు తయారు చేసే ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు రవాణా సౌకర్యం కల్పించేందుకు తోషిబా సంస్థ సి ఎస్ ఆర్ నిధుల ద్వారా అందజేసిన మినీ వ్యాన్‌ను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాహనం ద్వారా మహిళా సంఘం ఉత్పత్తుల విక్రయాలు పెరగడమే కాకుండా, వారి ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, సంగారెడ్డి ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుశీల, వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, జోగిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు, బిడెకన్నె మహిళా సంఘం సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల నర్సుపై కలెక్టర్ కు ఫిర్యాదు

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



మెదక్ పట్టణంలోని తెలంగాణ గురుకుల పాఠశాలలో దారుణం చోటుచేసుకుంది.. మనస్విని అనే విద్యార్థి పాఠశాలలో 7వ తరగతి చదువుతుంది. విద్యార్థిని తల్లిదండ్రులు నల్లగా ఉన్నారు. జంగిల్ నుంచి పట్టుకొచ్చారు.. లేబర్ పని చేసే వాళ్ళు ఇలాంటి తల్లిదండ్రుల పిల్లలకు టీసి ఇచ్చి పాఠశాల నుంచి పంపించేయాలని అవమానకర వ్యాఖ్యలు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్, పాఠశాలలో పని చేసే నర్సు ఇలాంటి వ్యాఖ్యలు చేయడంతో విద్యార్థిని తల్లిదండ్రులు కలెక్టర్ ప్రతిమ సింగ్ కు ఫిర్యాదు అందజేసిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. గత నెల 20న కిడ్నీ స్టోన్ సమస్యతో విద్యార్థిని మనస్విని బాధపడగా తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో తమ కూతురిని వైద్యం చేయించి ఇంటికి తీసుకెళ్లారు. నొప్పి తగ్గిన వారం రోజుల తర్వాత కూతురిని తల్లిదండ్రులు పాఠశాలకు తీసుకెళ్లగా పాఠశాలలో పనిచేసే నర్సు ఆశాజ్యోతి, ఇతర సిబ్బంది విద్యార్థిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విద్యార్థిని మనస్విని తెలిపింది. ఇంకా మూడు సంవత్సరాలు పాఠశాలలోనే చదవాలి, ఎలా చదువుతావో చూస్తామని భయపెట్టిస్తున్నారని విద్యార్థిని ఆవేదన వ్యక్తం చేసింది. అంతేకాకుండా అనారోగ్యానికి గురై వాంతులు చేసుకున్న సందర్భంలో కూడా తన పట్ల నర్సు ఆశాజ్యోతి దురుసుగా ప్రవర్తించారని విద్యార్థిని బోరున విలపించింది. తనతోపాటు చదువుకునే విద్యార్థుల ముందు పాఠశాలలో పనిచేసే నర్సు ఆశాజ్యోతి తన తల్లిదండ్రులను కూడా కించపరిచేలా అవమానకర వ్యాఖ్యలు చేసిందని తెలిపింది. ఈనెల 6న విద్యార్థిని ఆమె తల్లిదండ్రులు పాఠశాలకు తీసుకెళ్లగా కిడ్నీ స్టోన్ పూర్తిగా తగ్గిన తర్వాతనే పాఠశాలకు రావాలని పాఠశాల ప్రిన్సిపల్ చెప్పడంతో ఇంటికి వెళ్లారు. తమ కూతురూను పాఠశాలలో చేర్పించుకోవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ కు గోడు చెప్పుకున్నారు. ప్రిన్సిపాల్ తో మంట్లాడతానని కలెక్టర్ తెలిపారు.

## హామీలను అసెంబ్లీలో చర్చించాలి

- ఎమ్మెల్యే రోహిత్ కు సిఐటియు వినతిపత్రం



**ముద్ర ప్రతినిధి, మెదక్:**

ఎన్నికల ముందు గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను ఈ అసెంబ్లీ సమావేశాలలో చర్చించాలని, సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని తెలంగాణ గ్రామ పంచాయతి ఎంప్లాయిస్ & వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షులు కడారీ నర్సమ్మ అన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై అసెంబ్లీ సమావేశంలో మాట్లాడాలని గురువారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి నెల 5వ తేదీ లోపు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు ఇస్తామని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేస్తామని, జీతాల పెంపుదల ఉద్యోగ భద్రత ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామని ఇచ్చిన హామీల ను ప్రభుత్వం అమలు చేయాలని ఆమె కోరారు. గత మూడు నెలల నుండి జీతాలు రాక కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 17న చలో హైదరాబాద్ కార్యక్రమంలో జిల్లాలో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు సత్తయ్య, లాలూ ప్రసాద్, బాబు, మరియమ్మ, ఆయమ్మ, దుర్గయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన ఉండాలి

- అర్హులకు ప్రభుత్వ పథకాలు అందజేయాలి
- మంత్రి దామోదర్ రాజ నర్సింహ
- ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణపై సదస్సు

**ముద్ర, సంగారెడ్డి:**



నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు పంచాయతీ రాజ్, మున్సిపల్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా కంది ఎల్.ఎన్. కన్వెన్షన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య నేతృత్వంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్లు, గ్రామ సర్పంచులు, కౌన్సిలర్లకు ఏర్పాటు చేసిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. ప్రతి ప్రజాప్రతినిధికి తన గ్రామం, పట్టణం అభివృద్ధి చేయాలనే లక్ష్యం ఉంటుందని, అందుకోసం పంచాయతీరాజ్, మున్సిపల్, అటవీ శాఖ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌ను ఐదు దశలు, పది అంశాలుగా రూపొందించిందని తెలిపారు. మార్చి 6నుండి జూన్ 12 వరకు నిర్వహించే ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ మంత్రి దామోదర్ పిలుపునిచ్చారు. వచ్చే నెల ఏప్రిల్ 2 నుంచి గ్రామాల్లో గ్రామసభలు,పట్టణాల్లో వార్డు సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా గ్రామసభలకు హాజరై ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా కృషి చేయాలని సూచించారు. గ్రామాలు,పట్టణాల అభివృద్ధికి భవిష్యత్ కార్యాచరణ రూపొందించి అంకితభావంతో పనిచేస్తూ ప్రజల విశ్వాసం పొందుతారని సూచించారు. పని తీరుతోనే ప్రజల్లో గుర్తింపు వస్తుందని, సేవా భావంతో పనిచేసే ప్రజాప్రతినిధులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రజా పాలన ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల్లో మహిళలే అధికంగా ఉన్నారని తెలిపారు. మహిళా శక్తి రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే నిధులు ఎలా సమకూర్చుకోవాలి, గ్రామాల్లో రెవెన్యూ, అటవీ భూములను రక్షించుకోవడం, పంచాయతీరాజ్ చట్టాలను సర్పంచులు తెలుసుకోవడం చాలా ముఖ్యమని వెల్లడించారు. నేర్చుకుంటూ ముందుకు సాగితేనే అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి సూచించారు. ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక భాగంగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, గర్భిణీలు చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు, పోలీస్, రవాణా శాఖల ద్వారా రహదారి భద్రతపై అవగాహన, ట్రాఫిక్ నియమాల అమలు, సంక్షేమ పథకాల అమలులో ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనారిటీ సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించడం, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, హాస్టళ్ల పరిశుభ్రతపై పర్యవేక్షణ చేయాలని సూచించారు. రైతులకు పంటలపై మార్గదర్శకాలు, బీమా పథకాల అవగాహన, ఎరువులు-విత్తనాల లభ్యత, విద్యా రంగంలో పాఠశాలల మౌలిక వసతుల మెరుగుదల, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణ, పోటీ పరీక్షల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే యువత, క్రీడల అభివృద్ధికి క్రీడా పోటీలు, యువజనోత్సవాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మహిళా సాధికారత, స్వయం ఉపాధి, స్వయం సహాయక సంఘాల బలోపేతం ,బాల్య వివాహాల నివారణ, మహిళల భద్రతపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ నిషేధం, మొక్కల సంరక్షణ, వనమహోత్సవం ఏర్పాట్లు, పర్యావరణ అవగాహన ర్యాలీలు నిర్వహించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కావాలంటే ప్రజాప్రతినిధులు చట్టాలు, విధానాలపై అవగాహన పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. తద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతారని తెలిపారు. గ్రామ సభల ద్వారా లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వ పథకాలు అందించేందుకు ఈ అవగాహన కార్యక్రమాలు దోహదపడతాయని చెప్పారు. ప్రజల అవసరాలను గుర్తించి తగిన ప్రణాళికలు రూపొందిస్తే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి పథంలో ముందంజలో ఉంటాయని తెలిపారు. టి.జి.ఐ.ఐ.సీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రజల కోసమేనని, ప్రజాప్రతినిధులు ప్రజల్లో ఉండి అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని అన్నారు. జహీరాబాద్ నిమ్జ్ పారిశ్రామిక ప్రాంతం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ ప్లాస్టిక్ నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు తమ ఐదు సంవత్సరాల పాలనలో గ్రామాలు, పట్టణాలను అభివృద్ధి పథంలో నడిపించాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, అటవీ సంరక్షణకు కృషి చేయాలని, మున్సిపాలిటీలలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కార్యాచరణను వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫయిమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు,గ్రామ సర్పంచులు,కౌన్సిలర్లు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ముగిసిన పోలీసు స్పోర్ట్స్ మీట్

- బహుమతులు అందజేసిన ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయం మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన జిల్లా పోలీసు క్రీడా పోటీలు ముగిసాయి. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు విభాగాలకు చెందిన సిబ్బంది ఈ పోటీల్లో పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటారు. క్రీడల ద్వారా సిబ్బందిలో ఐక్యత, స్నేహభావం పెంపొందించడమే కాకుండా విధుల్లో ఉండే ఒత్తిడిని తగ్గించుకోవడానికి ఈ పోటీలు ఎంతో ఉపయోగపడతాయని ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు పేర్కొన్నారు.
క్రికెట్ ఫైనల్ లో డిఏఆర్ మెదక్ జట్టు విజేతగా నిలిచింది. కబడ్డీలో డిఏఆర్ మెదక్ జట్టు విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. వాలీబాల్ లో డిఏఆర్ మెదక్ జట్టు విజేతగా నిలిచింది. బ్యాడ్మింటన్ పోటీల్లో సింగిల్స్ విభాగంలో సత్యనారాయణ, సుధాకర్ గెలుపొందారు. డబుల్స్ విభాగంలో యాదగిరి, దీనకర్ జోడీ విజేతలుగా నిలవగా, ఆంజనేయులు, రమేష్ జోడీ రన్నర్స్‌గా నిలిచారు. అధికారుల విభాగం బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ సీఐ మహేష్ జోడీ విజేతలుగా నిలిచారు. అధికారుల సింగిల్స్ విభాగంలో మెదక్ సీఐ మహేష్ విజేతగా నిలవగా, ఆర్ఎస్ఐ సుభాష్ రన్నర్‌గా నిలిచారు. మహిళల విభాగంలో నిర్వహించిన పోటీల్లో తేజస్విని, దేవిభాయి విజేతలుగా నిలవగా, సరిత, కవిత రన్నర్స్‌గా నిలిచారు. మహిళల సింగిల్స్ విభాగంలో మౌనిక విజేతగా నిలవగా, పూజ రన్నర్‌గా నిలిచింది. పోటీల్లో విజయం సాధించిన సిబ్బందికి ఎస్పీ ట్రోఫీలు, మెడల్స్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మెదక్ అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సుభాష్ చంద్ర బోస్, రంగనాథ్, సీఐలు జార్జ్, కృష్ణమూర్తి, సందీప్ రెడ్డి, మహేష్, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు



## ఆకట్టుకున్న ఫోటో ఎగ్జిబిషన్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ అందరిని ఆకట్టుకుంది. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశాల మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో డిపిఆర్ఓ కే. రామచంద్ర రాజు, ఏపీఆర్ఓ బాబు రావులు ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు తిలకించి ప్రశంసించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు, నోడల్ ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# సమన్వయంతో పని చేయాలి

- సర్పంచ్, కౌన్సిలర్ల అవగాహన సదస్సులో కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులకు ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ...పట్టణ, గ్రామస్థాయిలో ప్రజా ప్రతినిధులు అధికారుల సమన్వయం చాలా ముఖ్యమన్నారు.
రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఒక బృహత్కర కార్యక్రమం అన్నారు. గ్రామ సర్పంచులు గ్రామం నాది అనే భావం కలిగి ఉండాలన్నారు. 99 రోజుల్లో అనేక కార్యక్రమాల చేపడుతునట్లు చెప్పారు. సుబిక్షమైన పట్టణ, పల్లెల కోసం నిరంతరం కృషి చేయాలన్నారు.

**ప్రజలకు పథకాలు తెలియజేయాలి : ఎమ్మెల్యే రోహిత్**

ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి, పథకాల గురించి ప్రజలకు తెలపాలని ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్ రావు సూచించారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం నిరతరం శ్రమిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, జీరో విద్యుత్, సన్నబియ్యం, మెడికల్ కాలేజీ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం లాంటి అనేక పథకాలు చేపట్టామన్నారు. అధికారులు,, ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలను తీర్చి, పథకాలు ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. శాంతి భద్రతను కాపాడాలని, రోడ్డు ప్రమాదాల వల్ల రోజు రోజుకు మరణాల సంఖ్య పెరుగుతుందని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి, డ్రగ్స్, సైబర్ క్రైమ్ పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నోడల్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పట్టణ, గ్రామీణ ప్రజా ప్రతినిధుల పదవి చిన్నదైన బాధ్యత పెద్దదన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా అవసరాలను తీర్చాలన్నారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ..పట్టణ, గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి పథంలో నడవాలంటే ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కారం చూపించాలన్నారు. ఈ సందర్భంగా నివేదిత చేసిన నృత్యం అందరిని అలరించింది. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డీపీఓ యాదయ్య, డిఎఫ్ఓ జోజి, ఆర్డీఓ రమాదేవి, జిల్లా సంక్షేమ అధికారులు హేమ భార్గవి, విజయలక్ష్మి, నీలిమలు 10 అంశాలపై అవగాహనా కల్పించారు. మెదక్,, రామాయంపేట మున్సిపల్ చైర్ పర్సన్ లు రాధిక లావణ్య, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
13.03.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ఐపీఎల్ అత్యంత వేగమైన సెంచరీ**



ఐపీఎల్‌లో అత్యంత వేగంగా సెంచరీ చేసిన ఆటగాడు Chris Gayle. కేవలం 30 బంతుల్లోనే శతకం సాధించాడు.



# పెళ్లి వ్యాన్ బోల్తా

- ఇద్దరి మృతి
- మరో ఇద్దరి పరిస్థితి విషమం
- 21 మందికి గాయాలు

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

నిర్మల్ జిల్లా కొండాపూర్ బైపాస్ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. 21 మందికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం సోంపల్లి నుంచి ఆర్మూర్‌లో జరిగే పెళ్లికి 21 మందితో వెళ్తున్న బొలెరో మ్యాక్స్ ఐచర్ వాహనం కొండాపూర్ సమీపంలో టైర్ పేలడంతో అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న 21 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు, స్థానికులు స్పందించి గాయపడిన వారిని అంబులెన్స్ లో వెంటనే నిర్మల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో లక్ష్మణ్ (60), తులసీ దాస్ (38) మృతి చెందారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆదిలాబాద్ రిమ్స్ కు తరలించారు. మిగిలినవారిని నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఇదిలా ఉండగా వాహనంలో అధికంగా ప్రయాణికులు ఉండటం, వేసవి కాలం కావటం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుందని భావిస్తున్నారు. ఈ ఘటనలో గాయపడిన క్షతగాత్రులను స్థానిక
ఎస్పీ డా.జి. జానకి షర్మిల నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసు కున్నారు. బాధితులకు అవసరమైన అన్ని సేవలదించాలని వైద్యులకు సూచించారు. అలాగే బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు.

# 15 ఏండ్లు కాంగ్రెస్ దే అధికారం

- సర్పంచ్ లు బాధ్యతతో పని చేయాలి
- గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అండ
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**ముద్ర, నల్గొండ :**




తెలంగాణలో మరో పదిహేనేళ్లు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం ప్రజాపాలనప్రగతి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నల్లగొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో కోమటిరెడ్డి పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కుటుంబ పాలన తప్ప ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు కాలేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే ప్రజా పాలన మొదలైందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. పేదలందరికీ తెల్ల రేషన్ కార్డులు, ఉచిత కరెంటు బిల్లు, ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు వంటి ఎన్నో సంక్షేమ పథకాలు ఇస్తున్నట్లు వివరించారు. సర్పంచులు గ్రామాల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలన్న మంత్రి.. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్య ఉన్న సర్పంచులు నేరుగా కలెక్టర్‌ను తనను కలవచ్చని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని మంత్రి కోమటిరెడ్డి భరోసా ఇచ్చారు.

# ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టింది

- గ్యాస్ వినియోగదారులు ఆందోళన చెందొద్దు
- ఆల్ ఇండియా ఎల్పీజీ డీలర్ల సంఘం అధ్యక్షులు పీవీ రావు

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**



ప్రస్తుతం కొనసాగుతున్న ఇజ్రాయెల్ ఇరాన్ యుద్ధం నేపథ్యంలో గ్యాస్ సరఫరా విషయంలో ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టినట్లు ఆల్ ఇండియా ఎల్పీజీ డీలర్ల సంఘం అధ్యక్షులు పింగళి వేంకటేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు నిర్మల్ లో ఆయన 'ముద్ర ప్రతినిధి' తో మాట్లాడుతూ యుద్ధం నేపథ్యంలో ప్రభుత్వం సరఫరాను క్రమబద్ధీకరించేందుకు అమెరికా, నైజీరియా వంటి ఉత్పాదక దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. గృహావసరాలకు ఇబ్బంది కలుగకుండా వాణిజ్య సిలెండర్లపై ఆంక్షలు విధించినట్లు తెలిపారు. అలాగే దేశ వ్యాప్తంగా ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం కింద 12 కోట్ల కనెక్షన్లు విడుదల చేశారన్నారు. వీటిలో దాదాపు 11.50 కోట్ల మేర వినియోగదారులు వారి 12 సిలిండర్ల ఏడాది కోటాను వినియోగించుకుంటున్నారని చెప్పారు. ఐతే వీటిలో అత్యధికం మార్కెట్ కు తరలుతున్నాయనే సమాచారం మేరకు నియంత్రణ విధించినట్లు తెలిపారు. కాగా కొరత భయంతో పలువురు వినియోగదారులు ఖాళీ సిలిండర్లు లేకపోయినా ముందుగానే బుకింగ్ చేసుకుంటున్న కారణంగా డెలివరీ సిబ్బంది వెనక్కి రావాల్సి వస్తోందని వివరించారు. దీంతో వాస్తవంగా అవసరం ఉన్నవారు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. సిలిండర్ల పంపిణీ కోసం కేంద్ర పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ పలు చర్యలను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. సిలిండర్లను అవసరం లేకుండా బుకింగ్ చేయటాన్ని నిరోధించేందుకు పట్టణాల్లో 25, గ్రామాల్లో 45 రోజుల వ్యవధి విధించారని పేర్కొన్నారు. అవసరం మేరకు పొదుపుగా వాడుకుంటే కొరత రాకుండా చూడవచ్చని పేర్కొన్నారు.

# ప్రభుత్వ లక్ష్యసాధనలో భాగస్వాములుకండి

- త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధనలో పోలీసుల పాత్ర కీలకం
- పోలీస్ శాఖలో దశలవారీగా వినియోగంలో ఎలక్ట్రిక్ వాహనాలు
- రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రూరల్ అగ్రి రీజియన్ పై దృష్టి
- ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



కాంగ్రెస్ పాలనలో తెలంగాణ 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈ లక్ష్యసాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకమని చెప్పారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి హోంశాఖ, పరిశ్రమలు, ఐటీ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద సంఖ్యలో పెట్టుబడిదారులు వస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతలు కీలకం అన్నారు. ఈ అంశంలో ఏ చిన్న పొరపాటుకు హోంశాఖ అధికారులు, సిబ్బంది అవకాశం ఇవ్వొద్దన్నారు. ప్రతి కదలిక పోలీసుల కను సన్నల్లో ఉండాలని సూచించారు. విధుల నిర్వహణ క్రమంలో హోం శాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. హైదరాబాద్ నగరం ప్రపంచంలో మేటి నగరంగా ఎదుగుతున్న క్రమంలో వేగంగా పలు సంస్కరణలు చేపడుతున్నామని చెప్పారు. ఇందులో భాగంగా
పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని సూచించారు. నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర గణనీయంగా ఉంటుందన్న భట్టి.. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సీసీ కెమెరాల వినియోగాన్ని పెద్ద సంఖ్యలో చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని చిన్న కదలికను సైతం వెంటనే గుర్తించి నిఘాను పటిష్టం చేయాలన్నారు. అందుకు సీసీ కెమెరాల వినియోగాన్ని పెంచాలన్నారు. దానికి అవసరమైన సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.
2047 త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా లక్ష సాధనలో పబ్లిక్, ప్రైవేట్ మోడల్ అనివార్యమని భట్టి అభిప్రాయపడ్డారు. ఆ విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని పరిశ్రమల శాఖ అధికారులకు సూచించారు. క్యూర్, ప్యూర్ తో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రేర్ (రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ) సమ ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ సీఎం సూచించారు. రేర్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. మైక్రో, స్మాల్, మీడియం ఇండస్ట్రీల (ఎంఎస్ ఎంఈ) ను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలనేది ప్రజా ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. ఎంఎస్ ఎంఈల ద్వారా రాష్ట్ర నలుమూలలోని యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధితో పాటు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉన్న రంగం ఎంఎస్ఎంఈ అన్నారు. 41 జీసీసీలతో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని గుర్తు చేశారు. ఇదే వేగాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వ నుంచి ప్రోత్సాహం కల్పిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు అన్నారు. డాటా సెంటర్లలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) వినియోగాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని మంత్రి శ్రీధర్ బాబుకు సూచించారు. ఈ సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సీవీ ఆనంద్, తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాలు సంస్థ ఎండీ శశాంక, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

# గ్యాస్ కొరత రాకుండా చూస్తాం

- గ్యాస్‌ను బ్లాక్ మార్కెట్ కు తరలించే ఏజెన్సీలు రద్దు
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

గ్యాస్ సరఫరాపై వినియోగదారులు ఆందోళన చెందవద్దని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు. గ్యాస్‌ను బ్లాక్ మార్కెట్ లో విక్రయించే ఏజెన్సీలను రద్దు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో డొమెస్టిక్ గ్యాస్‌కు ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి కమర్షియల్ సిలిండర్ల కొరత మాత్రమే ఉందని తెలిసిందన్నారు. శుక్రవారం గ్యాస్ ఏజెన్సీలతో సమావేశమై రాష్ట్రంలో గ్యాస్ డిమాండ్, సప్లైపై ఆరా తీస్తామని చెప్పారు. గ్యాస్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. గురువారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏజెన్సీలతో జరగనున్న సమావేశంలో అన్ని సమస్యలకు పరిష్కారం చూసుతామని తెలిపారు. కాగా ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర పోరు ప్రభావంతో దేశ వ్యాప్తంగా గ్యాస్, చమురుకు తీవ్ర కొరత ఏర్పడింది. గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని కేంద్రం చెబుతున్నప్పటికీ.. వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. తెలంగాణలో వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దాంతో హోటళ్లు, హాస్టళ్లు, మెస్‌లకు అవసరమైన మేర కమర్షియల్ సిలిండర్ల సరఫరా లేకపోవడంతో నగరంలో చాలా ప్రాంతాల్లో అవిమూతపడ్డాయి. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల కొరత నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది.



**గ్యాస్ బుకింగ్ గడువు పెంపు..**

ప్రజలకు కేంద్రం మరోసారి షాకిచ్చింది. వంటగ్యాస్ సిలిండర్ల బుకింగ్ గడువును మరోసారి పెంచింది. ఇప్పటికే పట్టణాల్లో సిలిండర్ల మధ్య కనీస గడువును 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచగా... తాజాగా గ్రామాల్లోనూ ఈ నిబంధనలు విధించింది. గ్రామాల్లో కూడా సిలిండర్ల మధ్య కనీస గడువును 25 రోజుల నుంచి 45 రోజులకు పెంచింది. ఈ కొత్త నిబంధన, అక్రమ నిల్వలను అరికట్టేందుకు, సరఫరాను క్రమబద్ధీకరించేందుకు అమలులోకి తీసుకొస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు దేశవ్యాప్తంగా గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.60 పెరిగింది. హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర వ్యాపార సంస్థలు వినియోగించే కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.115 పెరిగింది. ఈ పెంపు వెంటనే అమల్లోకి రావడంతో వినియోగదారులు అదనపు భారం భరించాల్సి వస్తోంది. హైదరాబాద్‌లో గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.965గా ఉంది. ఇతర నగరాల్లో కూడా ధరలు ఇదే విధంగా పెరిగాయి.

# ప్రజా ప్రతినిధులు ప్రజల్లో మమేకం కావాలి

- మంత్రి జూపల్లి కృష్ణారావు

**ముద్ర, వనపర్తి :**



జిల్లాలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లు, కౌన్సిలర్లు ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేసి, వారి మెప్పు పొందాలని ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. గురువారం స్థానిక కళ్యాణ సాయి గార్డెన్స్‌లో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా ఇటీవల నూతనంగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లకు నిర్వహించిన శిక్షణ కు మంత్రి జూపల్లి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు పలు కీలక సూచనలు చేశారు. మంత్రి తో పాటు కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీత రెడ్డి, వనపర్తి, దేవరకద్ర ఎమ్మెల్యేలు తూడి మేఘా రెడ్డి, జి .మధుసూదన్ రెడ్డి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్ ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించడమే లక్ష్యంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికను సీఎం రేవంత్ రెడ్డి తీసుకొచ్చారని చెప్పారు. ఇందులో భాగంగా జిల్లాలో ప్రజల చేత నూతనంగా ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులందరూ భాగస్వాములై ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రతిరోజూ ఉదయం 2 గంటల పాటు 20 నుంచి 30 ఇళ్లను సందర్శించి, ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధి కారులకు నివేదించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. తద్వారా సమస్యలను పరిష్కరించి ప్రజల మెప్పు పొందాలని సూచించారు. ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కడం గొప్ప విషయమని ఆ పేరును అలాగే నిలబెట్టుకోవాలని సూచించారు. నిరంతరం ప్రజలతో మమేకం అవ్వడం ద్వారా ప్రజా ప్రతినిధులకు , ప్రజలకు మధ్య ఉన్న బంధం బలోపేతం అవుతుందన్నారు. మనం చేసే ఏ పనైనా పదిమందికి ఉపయోగపడే విధంగా ఉండాలని సూచించారు. రాబోయే రోజుల్లో నిర్వహించబోయే గ్రామ సభల్లోనూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, గృహ జ్యోతి మహాలక్ష్మి ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలు అన్నింటిని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ నూతనంగా గెలిచిన ప్రజాప్రతినిధులు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తమ ఆఫీసులతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామాలు వార్డుల్లో నీటి వృధాను ఎలక్ట్రిసిటీ వృధాను అరికట్టాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి వనపర్తి జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచే విధంగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, కొత్తకోట మున్సిపల్ చైర్ పర్సన్ అరుణ, పెబ్బేరు మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీనివాస్ గౌడ్, ఆత్మకూరు మున్సిపల్ చైర్పర్సన్ నాగమణి, అమరచింత మున్సిపల్ చైర్ పర్సన్ జింక సువర్ణ, సర్పంచులు, కౌన్సిలర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వైసీపీలో వారసులకు నో చాన్స్ ..!

- సీనియర్లకే ప్రాధాన్యం

**ముద్ర న్యూస్:**



వైసీపీలో వారసులు అనేక మంది ఉన్నారు. వారు 2024 ఎన్నికల్లోనే పోటీకి సిద్ధంగా ఉన్నారు. కానీ ఆనాడు వైసీపీ అధినాయకత్వం వారికి అనుమతి ఇవ్వలేదు. ఆ ఎన్నికలు చాలా కీలకమైనవని భావిస్తూ తండ్రులనే రంగంలోకి దిగమని కోరింది. అయినా సరే కొన్ని చోట్ల అధినాయకత్వాన్ని ఒప్పించి కొంతమంది తండ్రులు తమ బిడ్డలకు టికెట్లు తెచ్చుకున్నారు. అయితే అలాంటి చోట్ల కూడా దారుణమైన ఫలితాలు వచ్చాయి. దాంతో వైసీపీ హైకమాండ్ ఆలోచనలు ఒక్కసారిగా మారాయని అంటున్నారు. ఈసారి ఎన్నికలు 2024 కంటే ఎంతో ప్రతిష్టాత్మకమైనవి అని వైసీపీ పెద్దలు భావిస్తున్నారు. దాంతో వారసులకు నో చాన్స్ అన్న చర్చ అయితే ఫ్యాన్ పార్టీలో జోరుగా సాగుతోంది. గత ఎన్నికల్లో తిరుపతి నుంచి భూమన కరుణాకరరెడ్డి తనయుడు అభినయ్ రెడ్డి పోటీ చేశారు, అలాగే చంద్రగిరి నుంచి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, మచిలీపట్నం నుంచి పేర్ని కిట్టూ పోటీ చేశారు. వీరంతా ఓటమి పాలయ్యారు. దాంతో ఈసారి వీరి ప్లేస్ లో తండ్రులనే రెడీ కావాలని వైసీపీ హైకమాండ్ సూచించిందని అంటున్నారు. ఈ క్రమంలోనే తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఇటీవల కాలంలో తిరిగి క్రియాశీలం అయ్యారని అంటున్నారు. ఆయన తరచూ మీడియా సమావేశాలు పెడుతున్నారు. భూమన పార్టీ నేతలతో కూడా ఎక్కువగా సమావేశాలు జరుపుతున్నారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని ఆయన సంకేతాలు ఇచ్చేశారంటున్నారు. తన కుమారుడికి రాజకీయంగా ఎంతో భవిష్యత్ ఉందని, వైసీపీకి ఈ ఎన్నికలు ముఖ్యమైనవి కాబట్టి తానే పోటీకి సిద్ధం అని ఆయన అంటున్నారు. ఇక మాజీ మంత్రి పేర్ని నాని అయితే తన కుమారుడినే పోటీకి పెట్టాలని చూస్తున్నారు. చెవిరెడ్డి భాస్కరరెడ్డి అదే ఆలోచనలో ఉన్నారు. ఇక ఏపీలో చూస్తే చాలా మంది వైసీపీ సీనియర్ నాయకులు తమ కుమారులకు లేదా కుమార్తెలను ఈసారి టికెట్ తెచ్చుకుని పోటీ చేయించాలని చూస్తున్నారు. అయితే కీలక స్థానాల్లో తండ్రులే పోటీ పడితే మంచి ఫలితాలు వస్తాయనన్నది వైసీపీ హైకమాండ్ బలమైన భావనగా ఉందంటున్నారు. ఉత్తరాంధ్రాలో చూస్తే బొత్స సత్యనారాయణ తన కుమారుడిని చీపురుపల్లి నుంచి దించాలని చూస్తున్నారు. అలాగే మాజీ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి తన కుమార్తెకి టికెట్ కోరాలని చూస్తున్నారు. శ్రీకాకుళంలో ధర్మాన సోదరులు తమ కుమారులనే పోటీకి దించే యోచనలో ఉన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాల చూస్తే మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు కుమార్తెని మళ్లీ పోటీ చేయించాలని చూస్తున్నారు. అయితే జగన్ వీరికి గ్రీన్ సిగ్నల్ ఇస్తారా లేదా అన్నది చర్చగా ఉంది. అంతే కాదు చాలా చోట్ల తండ్రులను ఎంపీలుగా బరిలోకి దించాలని కూడా అనుకుంటున్నట్లుగా చెబుతున్నారు. మరి ఆయా చోట్ల ఎవరికి అసెంబ్లీ టికెట్లు దక్కుతాయన్నది కూడా చర్చగా ఉంది. ఏది ఏమైనా సీనియర్ నేతలను తప్పించాలని టీడీపీ చూస్తూంటే, వైసీపీ మాత్రం సీనియర్లను వదలకూడదని పట్టుదలగా ఉంది. వచ్చే ఎన్నికల్లో టీడీపీ సహా కూటమి నేతలు యువ సైన్యంతో వస్తే, వైసీపీ మీద ఈ ఏజ్ ఫ్యాక్టర్ ఎంతవరకూ పనిచేస్తుంది అన్నది కూడా మరో చర్చగా ఉంది.

- కనపర్తి రవి

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
13.03.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ఐపీఎల్ యువ ఆటగాళ్లకు వేదిక**
ఐపీఎల్ యువ భారత క్రికెటర్లకు మంచి అవకాశాలు ఇస్తుంది. ఈ లీగ్ ద్వారానే Jasprit Bumrah, Hardik Pandya వంటి ఆటగాళ్లు ప్రపంచస్థాయికి ఎదిగారు.



## కలసి పనిచేస్తే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

**రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి**

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :**

ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేస్తే పేదల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లకు, కౌన్సిలర్లకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన స్థానిక ప్రజాప్రతినిధులపై అనేక బాధ్యతలు ఉన్నాయని, ప్రజలతో మమేకమై పనులు చేసినప్పుడే ప్రజల మన్ననలను పొందుతారని అన్నారు. మున్సిపల్ పట్టణాలలో ప్రజలు అనేక సమస్యలతో ఉంటారని, వారి సమస్యలను తెలుసుకొని వాటిని తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా విద్యతోనే మార్పు వస్తుందని ప్రతి ఒక్కరు చదువుకునేలా చూడాలని, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు పారిశుధ్యం పై దృష్టి సారించాలని, మున్సిపాలిటీలను సవ్యంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ,వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య లేకుండా ప్రణాళిక రూపొందించాలని, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించే కార్యక్రమాలపై దృష్టి సారించాలని అన్నారు. రాజకీయాలకతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులందరూ కలిసి పనిచేసి అభివృద్ధి, సంక్షేమాన్ని సాధించాలని కలిసికట్టుగా పనిచేస్తే ఇది సాధ్యమవుతుందని తెలిపారు. అభివృద్ధితో పాటు, రోడ్డు భద్రత ,యువత మత్తుపదార్థాల బారిన పడకుండా ఉండడం, తదితర సామాజిక అంశాలపై కూడా దృష్టి సాధించాలని తెలిపారు.

**ప్రజాప్రతినిధులకు అవగాహన ఉండాలి : మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి**

రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ టి.కె. శ్రీదేవి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లకు, కౌన్సిలర్లకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం సంతోషకోరామన్నారు. నూతన ప్రజాప్రతినిధులు ప్రజల్లో ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన తీసుకుని వెళ్లాలని, ప్రజల కోసం పనిచేయాలని, ప్రజాక్షేత్రంలో ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక అమలులో భాగంగా క్షేత్ర స్థాయిలో కార్యక్రమాలను ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో ఆయా శాఖల అధికారులు వారి శాఖల ద్వారా అమలు చేసే పలు ప్రభుత్వ పథకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా, వీడియోల ద్వారా మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్ కె వి వై కూరగాయల కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్మన్లు కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరుట్ల తరహాలో మరిన్ని మోడల్ స్కూల్స్

- **పనులు బాగున్నాయని ప్రశంసించిన సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వీ.శేషాద్రి**

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండలంలోని ఆరుట్ల గ్రామంలో కొనసాగుతున్న తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్ అభివృద్ధి పనులను గురువారం ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ప్రధాన కార్యదర్శి వీ. శేషాద్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వెంట రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్, రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి, హౌసింగ్ శాఖ పీడీ చంపా నాయక్, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత రెడ్డి, స్థానిక విద్యా కమిటీ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మోడల్ స్కూళ్లను ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి పర్యవేక్షణలో ఆరుట్ల గ్రామంలో మోడల్ స్కూల్ నిర్మాణ పనులను మోడల్‌గా చేపడుతున్నారు. ఈ క్రమంలో మోడల్ స్కూల్ పనులను పరిశీలించేందుకు సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి ఆరుట్లను సందర్శించారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్‌లో కొనసాగుతున్న పనులను పరిశీలించి బాగున్నాయని ప్రశంసించారు. అలాగే మోడల్ స్కూల్ అభివృద్ధి పనులు, విద్యాబోధన, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సంబంధిత అధికారులను, స్థానిక గ్రామ విద్యా కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శేషాద్రి మాట్లాడుతూ ఆరుట్ల మోడల్ స్కూల్ తరహాలోనే హుజూర్‌నగర్-2 బెడ్ హమ్ హౌసింగ్ కాలనీలో మోడల్ స్కూల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకువచ్చి నాణ్యమైన విద్యను ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగా 100 నియోజకవర్గాల్లో మోడల్ స్కూళ్ల నిర్మాణం వేగంగా చేపడుతున్నట్లు తెలిపారు.

**- ఇందిరమ్మ ఇళ్ల తనిఖీ**

ఆరుట్ల గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సీఎంవో ప్రధాన కార్యదర్శి శేషాద్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు, ప్రేరేపిత లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణ పనులకు సంబంధించిన ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. స్థానిక గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులతో నిర్మాణ వ్యయాన్ని ఎలా తగ్గించాలి, లబ్ధిదారులకు అందుబాటులో ఉండి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసే అంశాలపై అధికారులతో చర్చించారు.



## నెట్‌ఫ్లిక్స్ వచ్చిందంటే హాలీవుడ్ వచ్చినట్లే..

- **తెలంగాణకు ఐదొందల మల్టీనేషనల్‌కంపెనీలు తెస్తాం**
- **ఆ ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి**
- **దిగ్గజ కంపెనీలకు అన్ని సదుపాయాలు కల్పిస్తాం**
- **కంపెనీల రక్షణ సర్కార్ బాధ్యత**
- **సీఎం రేవంత్ రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




ప్రపంచంలో ఉన్న ఐదొందల పెద్ద మల్టీనేషనల్ కంపెనీలను తెలంగాణకు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియో కార్యాలయాన్ని హైటెక్ సిటీలో సీఎం రేవంత్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. ఆయా కంపెనీలకు అవసరమైన స్థలం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టే కంపెనీలకు పూర్తి రక్షణ కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. వ్యాపారం అంటేనే తెలంగాణ.. తెలంగాణ అంటేనే వ్యాపారం అనే స్థాయికి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. విశ్వనగరంగా మారుతున్న హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి సంస్థలు క్యూ కడుతున్నాయన్నారు. హైదరాబాద్ నగరంలో ఉన్న మౌలిక సదుపాయాలు, ప్రభుత్వాల ప్రోత్సాహకాలు, అనువైన పరిస్థితులు, మానవ వనరులు సహా ఎన్నో సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. దీంతో ఎన్నో గ్లోబల్ కంపెనీలు.. హైదరాబాద్‌లో తమ బ్రాంచ్‌లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా విదేశీ వేదికలపై హైదరాబాద్ నగరానికి ఉన్న అవకాశాలను వివరిస్తూ ఆయా కంపెనీలను ఆకర్షిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా హైదరాబాద్‌కు నెట్‌ఫ్లిక్స్ సంస్థ వచ్చింది. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చిందంటే మన నగరానికి హాలీవుడ్ వచ్చినట్లేనని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తమ దృష్టి హాలీవుడ్‌పైనే ఉందని తాను గతంలోనే చెప్పానని గుర్తు చేశారు. నెట్‌ఫ్లిక్స్ రాకతో తన కల నిజం కాబోతుందని ఆనందం వ్యక్తం చేశారు. తాను బాల్యంలో ఉన్నప్పటి నుంచే తనకు సినిమాలు అంటే ఎంతో ఇష్టమని సీఎం వివరించారు. ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్ కార్యాలయాన్ని తన చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సినిమా రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించుకుని బాహుబలి, కల్కి, ఆర్ఆర్ఆర్, అరుంధతి వంటి సినిమాలను తీశారని పేర్కొన్నారు. మద్రాస్ కేంద్రంగా ఉన్న సినిమా ఇండస్ట్రీని ఎన్టీఆర్, అక్కినేని నాగేశ్వర్ రావు హైదరాబాద్‌కు తీసుకువచ్చారని గుర్తు చేశారు. కాలంతో పాటు సినీ ఇండస్ట్రీలో ఎన్నో మార్పులు వచ్చాయని తెలిపారు. నెట్‌ఫ్లిక్స్ సంస్థ తమ వ్యాపారాన్ని విస్తరించేందుకు విశాలమైన ఆఫీస్ నిర్మించుకునేందుకు కావాల్సిన భూమిని, కొత్తగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీలో ఇవ్వడానికి తమ ప్రభుత్వం రెడీగా ఉందని సీఎం తెలిపారు. ఫ్యూచర్ సిటీకి నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ ఆఫీస్‌ను తీసుకురావాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఐలైన్ స్టూడియో సీఈఓ జెఫ్ షపిరో, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు సినీ నటుడు, నిర్మాత రాణా దగ్గుబాటి, తెలంగాణ ఫిలిం డెవల్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజుతోపాటు నెట్‌ఫ్లిక్స్‌కు చెందిన పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలపై గళమెత్తుతా

- **అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తా**
- **మాజీ మంత్రి హరీశ్ రావు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, పాలకుల వ్యతిరేక విధానాలపై అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. కార్మికుల పక్షాన నిలబడి, వారి సమస్యలను సభ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీకి, కార్మికులకు అన్యాయం చేస్తోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒకవైపు ప్రభుత్వంలో విలీనం చేసి సంస్థను కాపాడుకోవాలని కార్మికులు పోరాడుతుంటే.. రేవంత్ రెడ్డి మాత్రం ఒక్కో విభాగాన్ని ప్రైవేటీకరించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం హరీశ్ రావును కలిసిన టీజీఎస్ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు కార్మిక సంఘ నేతలకు హామీ ఇచ్చారు. కాలుష్య నియంత్రణ పేరుతో ఎలక్ట్రిక్ బస్సుల తయారీని కార్పొరేట్ శక్తులకు అప్పగించిన ప్రభుత్వం వారికే సబ్సిడీలు ఇస్తూ ఆర్టీసీని నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. జీరో టికెట్ అమలు కోసం ప్రతినెలా రూ.350 కోట్లు చెల్లిస్తామని చెప్పి ఇప్పుడు అరకొర నిధులు చెల్లించి చేతులు దులుపుకోవడం శోచనీయమన్నారు. గత రెండేళ్లుగా ఈ పథకానికి సంబంధించి చెల్లించాల్సిన బకాయిల భారాన్ని ఆర్టీసీపైనే మోపడంతో సంస్థ ఆర్థికంగా కుదేలవుతోందన్నారు. సంస్థ ఉద్యోగులకు ఇప్పటికీ రెండు పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయన్న హరీశ్ రావు 2025 పీఆర్సీ సైతం అమలుకు నోచుకోకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినప్పటికీ... ఇప్పటివరకు ఈ ప్రభుత్వం 'అపాయింటెడ్ డే' ప్రకటించకపోవడం దుర్మార్గమన్నారు. కార్మికులకు దక్కాల్సిన పదోన్నతులు, ఉద్యోగ భద్రత, రిటైర్‌మెంట్ ప్రయోజనాలు వంటి హక్కులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. కార్మికుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఆర్టీసీపై సవతి తల్లి ప్రేమను చూపించకుండా.. తక్షణమే రూ.2,804 కోట్ల బకాయిలను విడుదల చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ పక్షాన బలంగా వినిపిస్తామని చెప్పారు. ప్రభుత్వం మెడలు వంచైనా పరిష్కారం దిశగా చర్యలు తీసుకునేలా పోరాడుతామని హరీశ్‌రావు ఆర్టీసీ కార్మిక సంఘ నేతలకు హామీ ఇచ్చారు.



## నృసింహుని సేవలో గవర్నర్..

**ముద్ర, ప్రతినిధి భువనగిరి :**

రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ్మస్వామి పుణ్యక్షేత్రాన్ని గురువారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. రాష్ట్ర గవర్నర్ కు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి గవర్నర్ కు పూలమొక్కలు బహుకరించి స్వాగతం పలికారు. తొలుత రాష్ట్ర గవర్నర్ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. వేద పండితులు, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి భావానీ శంకర్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు, వేద పండితులు ఆలయ సంప్రదాయంతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గవర్నర్ ధ్వజ స్తంభం వద్ద మొక్కి స్వామివారి అంతరాలయంలో అర్చన పూజలు నిర్వహించారు. కార్య నిర్వాహణాధికారి స్వామివారి మెమొంటోను గవర్నర్‌కు అందచేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త స్వామివారి ప్రసాదాన్ని గవర్నర్ కు అందచేశారు. అనంతరం అనుబంధ దేవాలయం శ్రీ పర్వత వర్ధిణి సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో స్పటిక లింగానికి అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఓయూ అభివృద్ధికి రూ. వెయ్యి కోట్లు


- **సిద్ధమవుతున్న రూట్ మ్యాప్**
- **ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణాకు ఐకాన్**
- **నిధులు మంజూరు చేయడం అభినందనీయం**
- **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక ఐకాన్ గా నిలిచిన ఉస్మానియా విశ్వవిద్యాలయం అభివృద్ధికి రూ. వెయ్యి కోట్లతో రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ప్రఖ్యాత విశ్వవిద్యాలయం మన రాష్ట్రంలో ఉండడం మనకెంతో గర్వకారణమని అన్నారు. అంతటి పేరెన్నికగన్న విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గురువారం ఉదయం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విభాగంలో ఆయన నిర్మాణ్26 సాంకేతిక సదస్సును ప్రారంభించి మాట్లాడారు. 1917 లో స్థాపించిన ఈ విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిందన్నారు. అందుకు కొనసాగింపుగా 1929 లో విశ్వవిద్యాలయం సౌజన్యంతో ప్రారంభమైన ఇంజినీరింగ్ కళాశాల యావత్ భారతదేశంలోనే అత్యంత ప్రాశస్త్యమైన కళాశాలలలో ఆరో స్థానంలో నిలిచిందన్నారు. అంతటి ప్రఖ్యాతి గాంచిన విశ్వవిద్యాలయం అభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించడమే కాకుండా సీఎం రేవంత్ రెడ్డి ఏకంగా రూ. వెయ్యి కోట్లు నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం చరిత్రలోనే ఇంత పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం చారిత్రాత్మక ఘట్టంగా ఆయన అభివర్ణించారు. అంతర్జాతీయ స్థాయిలో ఈ విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పం అన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి, అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి విశ్వవిద్యాలయంలో అవసరమైన అధ్యాపకుల పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఇక్కడి నుండి ఎంతో మేధో సంపద ఉత్పత్తి అయిందని ఆ మేధస్సు ప్రపంచ స్థాయిలో అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. సిలికాన్ వ్యాలీలో పనిచేస్తున్న మెజారిటీ ఇంజినీర్లు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచే ఎదిగిన వారన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ స్థాయికి ఎదిగిన నేతలు, క్రీడాకారులు, ఉన్నత పదవులు చేపట్టిన వారి అడుగులు ఇక్కడి నుంచే మొదలయ్యాయని ఆయన గుర్తు చేశారు. అలాంటి విశ్వవిద్యాలయం తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో అగ్రభాగాన నిలుచోవడమే కాకుండా విద్యార్థులు చేసిన త్యాగాలు ఇక్కడ ప్రస్తావనర్హమే అని భావిస్తున్నానని ఆయన చెప్పారు. ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా భాగస్వామ్యం కావాలని ఆయన ఉద్బోధించారు. రాష్ట్ర అభివృద్ధిలో ఇంజినీరింగ్ విభాగం ముఖ్య భూమిక పోషిస్తుందని ఆయన చెప్పారు. నిజాం సాగర్,నాగార్జున సాగర్, శ్రీశైలం వంటి భారీ ప్రాజెక్టులతో పాటు ఎస్.ఎల్.బి.సి,దేవాదుల వంటి ఆధునిక ప్రాజెక్టులు ఇంజినీరింగ్ ప్రతిభకు అద్దం పడుతున్నాయన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగము విద్యార్థులకు ప్రాక్టికల్స్ పాఠాలుగా ఉపయోగ పడుతాయని ఆయన చెప్పారు. భవిష్యత్ లో స్థిరమైన అభివృద్ధి,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ,జలవనరుల సమగ్ర నిర్వహణ తో పాటు చెక్ డ్యామ్ ల పునరుద్ధరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంజినీర్లు ప్రాజెక్టుల నిర్మాణాలకు మాత్రమే పరిమితం కాకుండా వాటి భద్రత,నిర్వహణ బాద్యతలు కుడా ఇంజినీర్లకు ఉంటాయన్నారు. నిర్మాణ్26 వంటి సాంకేతిక సదస్సులు విద్యార్థులకు పరిశోధన, సృజనాత్మక తాను పెంపొందించే వేదికలని ఆయన చెప్పారు. మన నిర్మాణాలు కేవలము కట్టడాలకే పరిమితము కాకుండా ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు దోహద పడాలని ఉద్బోధించారు.

**ఐపీఎల్ లో అత్యధిక ధరకు కొనుగోలు**

ఐపీఎల్ వేలంలో భారీ ధరకు కొనుగోలు చేసిన ఆటగాళ్లలో Mitchell Starc ఒకరు. అతను వేలంలో రికార్డు ధర సాధించాడు



## గంభీర్ విమర్శల నుంచి బయటపడినట్లేనా?

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత భారత జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై ఉన్న విమర్శలు కొంత వరకు తగ్గినట్లుగా కనిపిస్తున్నాయి. భారత జట్టును అభినందిస్తూ మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోని సోషల్ మీడియాలో "కోచ్... మీరు నవ్వితే బావుంటారు" అని చేసిన వ్యాఖ్య కూడా చర్చకు దారి తీసింది. సాధారణంగా చాలా సీరియస్‌గా కనిపించే గంభీర్, ఈసారి విజయానంతరం ఉత్సాహంగా కనిపించడం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. కోచ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత గంభీర్ అనేక విమర్శలను ఎదుర్కొన్నారు. జట్టు పరాజయాలు, కొన్ని ఎంపికల నిర్ణయాలు, సీనియర్ ఆటగాళ్లతో వ్యవహరించిన తీరు వంటి అంశాలపై ఆయనపై తీవ్ర చర్చ జరిగింది. ఒక దశలో ఆయనను కోచ్ పదవి నుంచి తప్పించాలనే డిమాండ్లు కూడా వినిపించాయి. అయితే సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని భారత జట్టు టీ20 ప్రపంచకప్ గెలవడంతో పరిస్థితి మారినట్లు కనిపిస్తోంది. యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వడం, సరైన వ్యూహాలతో జట్టును నడిపించడం గంభీర్ విజయానికి కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.



# ఐపీఎల్ 19వ సీజన్ తొలి షెడ్యూల్ విడుదల

## ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న మ్యాచ్‌లు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 19వ సీజన్‌కు సంబంధించిన తొలి దశ షెడ్యూల్‌ను బీసీసీఐ ప్రకటించింది. ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతల కారణంగా విమాన ప్రయాణాలపై ఇబ్బందులు ఉన్నప్పటికీ ఈ నెల 28 నుంచి కొత్త సీజన్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. మొదటి దశలో మొత్తం 20 మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. ప్రారంభ మ్యాచ్ బెంగళూరులో జరగనుండగా డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టును సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎదుర్కొంటుంది. తర్వాతి రోజు ముంబయి వాంఖడే స్టేడియంలో ముంబయి జట్టు కోల్‌కతాతో తలపడనుంది. ఏప్రిల్ 4, 5, 11, 12 తేదీల్లో రెండు చొప్పున మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మ్యాచ్‌లు ఏప్రిల్ 12 వరకు జరుగుతాయి. తమిళనాడు, అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఎన్నికల తేదీలు ఖరారైన తర్వాత మిగతా షెడ్యూల్‌ను ప్రకటించనున్నారు. తొలి మ్యాచ్ బెంగళూరులోనే జరుగుతుందా అన్నది ఇంకా స్పష్టత లేదు.



## ధోనిపై ఆరోపణలు అసత్యం.. సందీప్ పాటిల్ స్పష్టం

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

భారత మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనిపై యువరాజ్ సింగ్ తండ్రి యోగ్‌రాజ్ సింగ్ చేసిన ఆరోపణలు నిజం కావని మాజీ చీఫ్ సెలక్టర్ సందీప్ పాటిల్ స్పష్టం చేశారు. ధోని ఎప్పుడూ యువరాజ్‌ను జట్టులో నుంచి తప్పించాలని సెలక్షన్ కమిటీని అడగలేదని ఆయన చెప్పారు. సెలక్షన్ కమిటీ నిర్ణయాలపై ధోని ఎప్పుడూ నమ్మకం ఉంచేవాడని తెలిపారు. "యువరాజ్‌ను తప్పించమని ధోని ఒక్కసారి కూడా మమ్మల్ని కోరలేదు. తండ్రిగా యోగ్‌రాజ్ తన కుమారుడి గురించి భావోద్వేగంతో మాట్లాడటం సహజమే. కానీ ఇతరులపై నిందలు వేయడం సరైంది కాదు'' అని పాటిల్ వ్యాఖ్యానించారు. అలాగే సచిన్ టెండూల్కర్ కెరీర్ చివరి దశలో జరిగిన ఒక సంఘటనను కూడా పాటిల్ గుర్తుచేశారు. ఆ సమయంలో సచిన్ భవిష్యత్తు ప్రణాళికల గురించి తాను మాట్లాడినట్టు చెప్పారు. జట్టులో కొత్త ప్రతిభావంతులు వస్తున్న సమయంలో మార్పులు సహజమని అన్నారు. కానీ చాలా మంది ఆ విషయాన్ని మరిచి సచిన్‌ను తప్పించారని మాత్రమే గుర్తుంచుకున్నారని వ్యాఖ్యానించారు. ఇక ప్రస్తుత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌తో తనకు ఇప్పటికీ పెద్దగా మాట్లాడుకోవడం జరగదని పాటిల్ తెలిపారు. టీవీ కార్యక్రమాల్లో కలిసినా అతను తనతో మాట్లాడడని చెప్పారు. అయినప్పటికీ గంభీర్‌ను తాను గౌరవిస్తూనే ఉంటానని పాటిల్ వెల్లడించారు



## సూపర్ ఫామ్‌లో ఉన్నా సీఫర్ట్‌కు షాక్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

తాజాగా ముగిసిన టీ20 ప్రపంచకప్-2026లో అద్భుతంగా రాణించిన న్యూజిలాండ్ వికెట్‌కీపర్ బ్యాటర్ టిమ్ సీఫర్ట్‌కు హండ్రెడ్ లీగ్ వేలంలో అనూహ్య నిరాశ ఎదురైంది. మార్చి 12న జరిగిన వేలంలో అతన్ని ఏ ఫ్రాంచైజీ కూడా కొనుగోలు చేయకపోవడం క్రికెట్ వర్గాల్లో ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. మంచి ఫామ్‌లో ఉన్నప్పటికీ అతనిపై జట్లు ఆసక్తి చూపకపోవడం చర్చకు దారి తీసింది. అయితే వేలంలో మరోసారి అతని పేరు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో సీఫర్ట్ అద్భుతంగా ఆడాడు. మొత్తం 8 ఇన్నింగ్స్‌ల్లో 166కు పైగా స్ట్రైక్‌రేట్‌తో 326 పరుగులు చేసి టోర్నీలో రెండో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఈ టోర్నీలో అతడే అత్యధికంగా నాలుగు అర్ధసెంచరీలు నమోదు చేశాడు. భారత్‌తో జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్ బ్యాటర్లు విఫలమైన సమయంలో సీఫర్ట్ ఒక్కడే అర్ధసెంచరీతో జట్టును నిలబెట్టాడు. అంతకుముందు దక్షిణాఫ్రికాతో జరిగిన సెమీఫైనల్లో కూడా 58 పరుగులు చేసి తన స్థాయిని చూపించాడు. వికెట్‌కీపర్ బ్యాట ర్‌గా మంచి ఫామ్‌లో ఉన్న పట్టికీ హండ్రెడ్ లీగ్‌లో ఎవరూ తీసుకోకపో వ దం ఆశ్చ ర్యంగా మారింది.



## కఠిన సవాళ్లు ఇష్టమే: బుమ్రా

- టీ20 ప్రపంచ కప్ విజయం పై స్పందన

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

టీమ్ ఇండియా ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా టీ20 ప్రపంచ కప్ విజయం గురించి తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా బీసీసీఐ విడుదల చేసిన వీడియోలో మాట్లాడుతూ కఠిన సవాళ్లు ఎదుర్కోవడం తనకు ఎంతో ఇష్టమని తెలిపాడు. అలాంటి సందర్భాల్లో మంచి ప్రదర్శన చేసి జట్టుకు విజయాన్ని అందించడం తనకు అత్యంత సంతోషాన్ని ఇస్తుందని పేర్కొన్నాడు. గుజరాత్‌లోనే తన క్రికెట్ ప్రయాణం ప్రారంభమైందని, అదే నేలపై ప్రపంచ కప్ గెలవడం ప్రత్యేక అనుభూతిని ఇచ్చిందని చెప్పాడు. 2023 వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్ తృటిలో టైటిల్‌ను కోల్పోయిన సంఘటనను కూడా బుమ్రా గుర్తు చేసుకున్నాడు. ఆ మ్యాచ్ కూడా అహ్మదాబాద్‌లోనే జరిగిందని పేర్కొన్నాడు. గతంలో ఓటమి ఎదురైనా ఈసారి విజయం సాధించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపాడు. వరుసగా రెండోసారి టీ20 ప్రపంచ కప్ గెలవడం జట్టుకు గొప్ప విజయమని, ఇందుకు దేవుడికి కృతజ్ఞతలు తెలిపాడు. న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బుమ్రా అద్భుత బౌలింగ్ ప్రదర్శించాడు. నాలుగు ఓవర్లు వేసి కేవలం 15 పరుగులు మాత్రమే ఇచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. 256 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్

## అక్షర్ పటేల్‌కు క్షమాపణ చెప్పిన సూర్యకుమార్

- ప్రపంచ కప్ జ్ఞాపకాలు పంచుకున్న టీమ్ ఇండియా కెప్టెన్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

టీ20 ప్రపంచ కప్‌ను టీమ్ ఇండియా మూడోసారి గెలుచుకున్న నేపథ్యంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ టోర్నమెంట్‌కు సంబంధించిన అనుభవాలను గుర్తు చేసుకున్నాడు. సూపర్-8 దశలో దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌కు అక్షర్ పటేల్‌ను తుది జట్టులోకి తీసుకోకపోవడంతో అతడు అసంతృప్తిగా ఉన్నాడని తెలిపాడు. మ్యాచ్ అనంతరం వ్యక్తిగతంగా మాట్లాడి క్షమాపణలు కోరినట్లు సూర్య వెల్లడించాడు. తుది జట్టు ఎంపిక జట్టు నిర్వహణ నిర్ణయమని, అక్షర్ పటేల్ కూడా పరిస్థితిని అర్థం చేసుకున్నాడని చెప్పాడు. సెమీఫైనల్‌లో అక్షర్ పటేల్ పట్టిన అద్భుత క్యాచ్ మ్యాచ్ దిశను మార్చిందని సూర్య పేర్కొన్నాడు. ఫీల్డింగ్ కోచ్ దిలీప్ సాధనలో ఉత్తమ ప్రదర్శనకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం వల్ల ఆటగాళ్లలో పోటీ పెరిగిందని తెలిపాడు. స్వదేశంలో ప్రపంచ కప్ ఆడటం వల్ల ఒత్తిడి ఎక్కువగా ఉండడంతో సోషల్ మీడియాకు దూరంగా ఉండేందుకు ప్రయత్నించామని సూర్య వివరించాడు.



## ధోనికి క్లీన్ చిట్.. ఐపీఎల్‌కు ముందు భారీ ఊరట

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ ఆటగాడు ఎం.ఎస్. ధోనికి ఊరట లభించింది. పరస్పర విరుద్ధ ప్రయోజనాలు ఉల్లంఘించాడంటూ అతనిపై నమోదైన ఫిర్యాదును బీసీసీఐ ఎథిక్స్ కమిటీ కొట్టిపారేసింది. విచారణ అనంతరం ధోని ఎలాంటి తప్పు చేయలేదని కమిటీ స్పష్టం చేసి క్లీన్ చిట్ ఇచ్చింది. టీమిండియా ఆటగాడిగా ఉన్న సమయంలోనే 'ఆర్కా స్పోర్ట్స్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్' అనే క్రికెట్ అకాడమీతో ధోనికి అనుబంధం ఉందని 2024లో ఫిర్యాదు నమోదైంది. ఇది బీసీసీఐ నిబంధనలకు విరుద్ధమని ఫిర్యాదుదారు ఆరోపించారు. అయితే ధోని 2017లోనే ఆ సంస్థతో ఒప్పందం చేసుకున్నారని, సంబంధిత నిబంధనలు 2018లో అమల్లోకి వచ్చాయని ఎథిక్స్ కమిటీ పేర్కొంది. అందువల్ల ధోనిపై ఎలాంటి విరుద్ధ ప్రయోజనాల కేసు నిలబడదని తేల్చింది.

ఇదిలా ఉంటే ఐపీఎల్ 2026 సీజన్ కోసం చెన్నై సూపర్ కింగ్స్ ధోనిని రీటైన్ చేసుకుంది. ఈ సీజన్‌లో అతను అన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటాడని జట్టు యాజమాన్యం వెల్లడించింది.

ఐపీఎల్ 2026 సీజన్ మార్చి 28న ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో బెంగళూరులో ఆర్సీబీ జట్టు సన్‌రైజ





సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
13.03.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews







## ‘కాలరే ఎత్తరా’ ఫుల్ సాంగ్ రిలీజ్

పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న ‘ఉస్తాద్ భగత్ సింగ్’ సినిమా మరికొన్ని రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు హరీశ్ శంకర్ రూపొందించిన ఈ చిత్రం ఈ నెల 19న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. ఇటీవల ఈ సినిమాలోని మూడో పాటగా ‘కాలరే ఎత్తరా’ అనే పాట ప్రోమోను విడుదల చేసిన చిత్ర బృందం, తాజాగా ఆ పాటకు సంబంధించిన పూర్తి లిరికల్ వీడియోను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చింది. ఈ పాటలో పవన్ కళ్యాణ్ పాత్రలోని ధైర్యం, ఉత్సాహాన్ని ప్రతిబింబించేలా లిరిక్స్ మరియు సంగీతం రూపొందించబడింది. ఈ పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా, గాయకుడు రామ్ మిర్యాల తన ప్రత్యేక శైలిలో ఆలపించారు. సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ఈ పాటకు శక్తివంతమైన ట్యూన్ అందించారు. పాట విడుదలైన కొద్ది సమయంలోనే అభిమానుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై మంచి అంచనాలు పెంచగా, ‘కాలరే ఎత్తరా’ పాటతో అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. విడుదలకు ముందు చిత్ర బృందం మరిన్ని ప్రమోషనల్ కార్యక్రమాలతో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తోంది.


**అభిమానుల కోసం పవన్ తగ్గాడా?**

పవన్ కళ్యాణ్‌కు ఉన్న అభిమానుల నిబద్ధత గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సినిమా మీద ముందుగా విమర్శలు చేసినా, విడుదల సమయంలో మాత్రం థియేటర్లకు వెళ్లి పవన్‌ను చూడటంలో అభిమానులు ఎప్పుడూ వెనకాడరు. అందుకే ఆయన సినిమాలకు ఎప్పటికప్పుడు మంచి ఓపెనింగ్స్ వస్తుంటాయి. అయితే గతంలో పవన్ సినిమాల ప్రీమియర్, బెనిఫిట్ షోల టికెట్ ధరలు చాలా ఎక్కువగా ఉండేవి. కొన్ని సందర్భాల్లో రూ.800 నుంచి రూ.1000 వరకు ధరలు నిర్ణయించడంతో అభిమానులపై భారం పెరుగుతోందన్న విమర్శలు వినిపించాయి. ఇలాంటి పరిస్థితుల్లో పవన్ తాజా చిత్రం ‘ఉస్తాద్ భగత్ సింగ్’ విషయంలో మాత్రం టికెట్ ధరలను తగ్గించేలా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రీమియర్ షోల ధరను సుమారు రూ.500గా నిర్ణయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం. దీంతో అభిమానులకు కొంత ఊరటనిచ్చే నిర్ణయంగా ఇది మారిందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

## తప్పుడు ప్రచారంపై రష్మిక మండిపాటు..

**24 గంటల్లో తొలగించకపోతే చట్టపరమైన చర్యలు**

సామాజిక మాధ్యమాల్లో తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారంపై నటి రష్మిక మందన్న తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కొంతమంది కన్నడ మీడియా సంస్థలు మరియు సోషల్ మీడియా ప్రభావశీలులు తన గురించి అసత్య కథనాలు ప్రచారం చేస్తున్నారని ఆమె విమర్శించారు. ఈ నేపథ్యంలో అలాంటి ప్రచారాన్ని వెంటనే ఆపాలని హెచ్చరిస్తూ ఘాటైన లేఖను విడుదల చేశారు. గత ఎనిమిదేళ్లుగా తనపై తప్పుదారి పట్టించే ప్రచారం జరుగుతోందని రష్మిక పేర్కొన్నారు. తాను ఎప్పుడూ మాట్లాడని మాటలను తన పేరుతో ప్రచారం చేస్తూ కొందరు కథనాలు రాస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాలు తనను ఎంతో బాధపెట్టినా ఇప్పటివరకు సహనంతోనే స్పందించానని తెలిపారు. అయితే ఎనిమిదేళ్ల క్రితం జరిగిన ఒక వ్యక్తిగత సంభాషణలోని కొన్ని భాగాలను ఉద్దేశపూర్వకంగా బయటకు తీసి వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. గత 24 గంటల్లో తనపై మరింత తీవ్రంగా దుష్ప్రచారం జరిగిందని రష్మిక చెప్పారు. ఈ ప్రచారం తన వ్యక్తిగత గోప్యతను భంగం కలిగించడమే కాకుండా తన ప్రతిష్టను కూడా దెబ్బతీస్తోందని పేర్కొన్నారు. వ్యక్తిగత విషయాలను ఇలా ప్రజల్లోకి లాగడం బాధాకరమని ఆమె తెలిపారు. ఇకపై ఈ విషయంలో మౌనంగా ఉండబోనని రష్మిక స్పష్టం చేశారు. తనపై ప్రచారం చేస్తున్న తప్పుడు కథనాలను వెంటనే తొలగించాలని సామాజిక మాధ్యమాలు మరియు ప్రభావశీలులకు ఆమె సూచించారు. ఇందుకోసం 24 గంటల గడువు ఇస్తున్నానని తెలిపారు. ఆ గడువులోగా తప్పుడు కథనాలను తొలగించకపోతే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అవసరమైతే వారికి నోటీసులు కూడా జారీ చేస్తానని చెప్పారు. తన జీవితం ఎలా ఉండాలన్నది ఇతరులు నిర్ణయించే హక్కు ఎవరికీ లేదని, ప్రతి ఒక్కరి జీవితంపై నిర్ణయాలు తీసుకునే హక్కు వారికి మాత్రమే ఉందని రష్మిక స్పష్టం చేశారు.



## ‘వృషకర్మ’ కోసం నాగచైతన్య భారీ మేకోవర్..

నాగచైతన్యను ఇప్పటివరకు ఎక్కువగా క్లాస్ లుక్‌లో, లవర్ బాయ్ పాత్రల్లో చూసిన అభిమానులకు తాజాగా బయటకు వచ్చిన ఆయన కొత్త ఫొటో ఆశ్చర్యం కలిగిస్తోంది. దర్శకుడు కార్తీక్ దండు తెరకెక్కిస్తున్న ‘వృషకర్మ’ సినిమా కోసం చైతన్య తన లుక్‌ను పూర్తిగా మార్చుకున్నారు. జిమ్‌లో కసరత్తులు చేస్తూ ‘బీయింగ్ అర్జున్’ అంటూ ఆయన షేర్ చేసిన ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫొటోలో నాగచైతన్య సిక్స్ ప్యాక్ బాడీతో, బలమైన కండలతో రగ్గడ్ లుక్‌లో కనిపిస్తున్నారు. చేతిలో డంబెల్స్ పట్టుకుని గడ్డంతో కనిపిస్తున్న ఆయన రూపం సినిమాలో యాక్షన్ సన్నివేశాలు ఎంత తీవ్రంగా ఉండబోతున్నాయో సూచిస్తోంది. చైతన్య కెరీర్‌లో ఇదే అతిపెద్ద ఫిజికల్ ట్రాన్స్‌ఫార్మేషన్ అని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. అతీంద్రియ శక్తులు, పురాతన రహస్యాల నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో చైతన్య ‘అర్జున్’ అనే పాత్రలో కనిపించనున్నారు. ఆ పాత్రకు తగిన ఫిట్‌నెస్ కోసం ఆయన ప్రత్యేకంగా శ్రమిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఫొటోకు అజనీష్ లోక్‌నాథ్ అందించిన ‘ది రైజ్ ఆఫ్ వృషకర్మ’ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా మంచి హైప్ తీసుకొచ్చి

## ఎంజీఆర్‌పై వ్యాఖ్యలు.. రాజేంద్ర ప్రసాద్‌పై విమర్శలు



టాలీవుడ్ సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ ఇటీవలి కాలంలో వివిధ వేదికలపై చేసిన వ్యాఖ్యలతో తరచూ వివాదాల్లో నిలుస్తున్నారు. గతంలో కొన్ని సినీ కార్యక్రమాల్లో ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా విమర్శలకు దారితీశాయి. ఒక వేడుకలో ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం, మరో కార్యక్రమంలో నటుడు ఆలీని ఉద్దేశించి అనుచిత పదజాలం ఉపయోగించడం, మాజీ నటి రవళిపై బాడీ షేమింగ్ వ్యాఖ్యలు చేయడం వంటి ఘటనలు అప్పట్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఇప్పుడు తాజాగా తమిళ సినీ దిగ్గజం ఎంజీఆర్ గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు మరోసారి వివాదానికి కారణమయ్యాయి. ఒక కార్యక్రమంలో మాట్లాడిన రాజేంద్ర ప్రసాద్, తెలుగు నటుడు కాంతారావు నటించిన జానపద చిత్రాలను చూసి ఎంజీఆర్ భయపడ్డారని వ్యాఖ్యానిస్తూ అనుచిత పదజాలం ఉపయోగించారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తమిళ ప్రేక్షకుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. తమిళ ప్రజలు ఎంజీఆర్‌ను ఎంతో గౌరవంతో చూస్తారు. అలాంటి వ్యక్తి గురించి తక్కువగా మాట్లాడినట్లు భావించడంతో ఈ విషయం పెద్ద చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో తమిళ నటుడు విశాల్ కూడా స్పందించారు. రాజేంద్ర ప్రసాద్ వ్యాఖ్యలపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ‘‘మీపై గౌరవంతోనే ఈ మాటలు చెబుతున్నాను. మీరు చేసిన వ్యాఖ్యలు విని బాధపడ్డాను. కాంతారావును ప్రశంసించడం మంచి విషయమే. కానీ ఆ సందర్భంలో తమిళ ప్రజలు దైవంలా భావించే ఎంజీఆర్ గురించి తక్కువగా మాట్లాడడం బాధ కలిగించింది. దయచేసి ఈ విషయంపై క్షమాపణ చెప్పి వివాదానికి ముగింపు పలకండి’’ అని విశాల్ తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాజేంద్ర ప్రసాద్ మరోసారి తన వ్యాఖ్యలపై స్పందించి వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



## క్రియేటివిటీ హబ్‌గా హైదరాబాద్ ఎదుగుతుంది: రానా దగ్గుబాటి

భవిష్యత్తులో హైదరాబాద్ సృజనాత్మక రంగానికి ప్రధాన కేంద్రంగా మారుతుందని ప్రముఖ నటుడు రానా దగ్గుబాటి అభిప్రాయపడ్డారు. హైటెక్ సిటీలో నెట్‌ఫ్లిక్స్‌కు చెందిన ఐలైన్ స్టూడియోస్ కార్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రానా కూడా హాజరై మాట్లాడారు. ఐలైన్ స్టూడియోస్ హైదరాబాద్‌లో కార్యాలయం ప్రారంభించడం సంతోషకరమైన విషయమని రానా తెలిపారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలు నగరానికి రావడం వల్ల క్రియేటివ్ రంగానికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని ఆయన అన్నారు. ముఖ్యంగా యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com